వాయిస్ ఆఫ్ ప్రజలు
వాయిస్ టుడే
VOICE OF PRAJALU
TGTEL/25/A2649
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
మంగళవారం, ఫిబ్రవరి 17, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## మహిళలకు మరోసారి భారీ కానుక ఇచ్చిన నితీశ్ కుమార్

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహిళలకు శివరాత్రి కానుకను అందించారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున నేరుగా జమ చేశారు. తమ ఖాతాల్లో డబ్బు జమ కావడంతో మహిళలు ఖుషీగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఇలాగే మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. ఆ డబ్బు ప్రభావంతో మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేసి బీజేపీ-జేడీయూ కూటమికి భారీ మద్దతు తెలిపారు. ఫలితంగా ఎన్డీయే కూటమి 202 స్థానాలు కైవసం చేసుంది. నితీశ్ మరోసారి సీఎం అయ్యారు. ఇప్పుడు శివరాత్రి పండుగ సమయంలో మళ్లీ ఖాతాల్లో రూ.10 వేలు జమ కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహిళల సంక్షేమం విషయంలో నితీశ్ ఎప్పుడూ ముందుంటారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



# పట్టణ పాలనపై కాంగ్రెస్ పట్టు



- 81 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో
- వ్యూహాత్మక ప్రణాళికతో పురపీఠాల స్వాధీనం
- పెండింగ్ స్థానాలపైనా అధికార పార్టీ ధీమా
- నిజామాబాద్, కొత్తగూడెంలో కీలక రాజకీయ సమీకరణాలు
- బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు పార్టీ వర్గాల వెల్లడి

హైదరాబాద్: పురపాలక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఆశించినట్టుగానే పట్టణ స్థానిక సంస్థలపై బలమైన పట్టు సాధించింది. మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్లతో పాటు మేయర్లు, చైర్మన్ల పదవుల్లో అధిక భాగాన్ని తన ఖాతాలో వేసుకుంది. మొత్తం 90 స్థానిక సంస్థలను లక్ష్యంగా పెట్టుకుని పోటీకి దిగిన కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేసి 81 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లను కైవసం చేసుకోవడం గమనార్హం. స్వతంత్రులు, ఇతర పార్టీల మద్దతుతో గెలిచిన స్థానాలు కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా మారాయి. ఇంకా కొన్ని మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ కొనసాగుతుండగా, వాటిలోనూ మెజార్టీ స్థానాలు తమవేననే నమ్మకం అధికార పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అభ్యర్థుల ఎంపిక నుంచి చివరి దశ వరకు పార్టీ నాయకత్వం సమన్వయంతో పనిచేయడం విజయానికి ప్రధాన కారణమైంది. ఎమ్మెల్యేలు, మంత్రులు నియోజకవర్గాల వారీగా బాధ్యతలు తీసుకుని ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. పీసీసీ ఏర్పాటు చేసిన వార్‌రూమ్ కూడా పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంలో చురుకైన పాత్ర పోషించింది. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ధోరణిని రోజువారీగా సమీక్షిస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలతో నిరంతరం సంప్రదింపులు జరిపి వ్యూహాత్మక మార్గదర్శకాలు ఇచ్చారు. ప్రచారంలోనూ ప్రత్యక్షంగా

(మిగతా 2వ పేజీలో)



## బీజేపీకి మేయర్ పదవి దక్కకుండా కుట్రల : బండి సంజయ్

- సీఎం, మంత్రులు, ఇతర పార్టీలపై విమర్శలు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్న వ్యాఖ్య
- సోషల్ మీడియాలో ప్రజల ఆగ్రహం ప్రస్తావన
- బీఆర్ఎస్ కార్పొరేటర్ల తీర్పుకు అభినందనలు
- కుట్రలకు తగిన సమాధానం ఇస్తానని హెచ్చరిక

కరీంనగర్ : కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీకి మెజారిటీ సీట్లు వచ్చినప్పటికీ పదవులు దక్కకుండా కుట్రలు జరిగాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి రాజకీయ సమీకరణాలు చేస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరించారని విమర్శించారు. మీడియాతో మాట్లాడుతూ సీఎం ప్రారంభించిన రాజకీయ ఆటకు తానే ముగింపు ఇస్తానని ఘాటుగా హెచ్చరించారు. అనవసరంగా తనను లక్ష్యంగా చేసుకొని

(మిగతా 2వ పేజీలో)



## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలు: కెటిఆర్

- కిడ్నాప్ ప్రయత్నాలు, దాడులపై తీవ్ర ఆగ్రహం
- పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణ
- ఎక్స్ అఫీషియో ఓట్లపై ప్రజాస్వామ్య హననం వ్యాఖ్య
- డిజిపి జోక్యం చేసుకోవాలని డిమాండ్
- హంగ్ మున్సిపాలిటీలకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- అక్రమాలపై విచారణ జరపాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి

హైదరాబాద్: మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానం అప్రజాస్వామికంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్రంగా విమర్శించారు. పోలీసు బలగాలను అడ్డుగా పెట్టుకొని పలు పట్టణాల్లో అభ్యర్థులను

(మిగతా 2వ పేజీలో)

# జెఇఇ మెయిన్ ఫలితాల్లో తెలుగు విద్యార్థుల ప్రతిభ

### 100 పర్సంటైల్‌తో 12 మంది విద్యార్థుల మెరుపు

- ఏపీ, తెలంగాణ విద్యార్థుల ప్రత్యేక సత్తా
- ఎన్‌టిఎ అధికారిక ప్రకటన
- ఏప్రిల్‌లో రెండో విడత పరీక్షలు
- ఉత్తమ స్కోరుతో ర్యాంకుల కేటాయింపు
- ఐఐటీల ప్రవేశాలకు అడ్వాన్స్‌డ్ దారి



హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించిన జెఇఇ మెయిన్ తొలి విడత ఫలితాల్లో తెలుగు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ ఏడాది మొత్తం 12 మంది అభ్యర్థులు 100 పర్సంటైల్ స్కోరు సాధించగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్, తెలంగాణకు చెందిన వివాన్ శరద్ మహిశ్వరి ప్రత్యేకంగా నిలిచారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సోమవారం ఫలితాలను ప్రకటిస్తూ వివరాలు వెల్లడించింది. 100 పర్సంటైల్ సాధించిన అభ్యర్థుల్లో అత్యధికంగా రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవారే ఉన్నారు. ముగ్గురు రాజస్థాన్ నుంచి, ఇద్దరు ఆంధ్రప్రదేశ్ నుంచి, ఒక్కొక్కరు తెలంగాణ, ఢిల్లీ, బిహార్, ఒడిశా, హరియాణా, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి ఉన్నారు. విశేషమేమిటంటే, అర్హత సాధించిన 12 మంది అభ్యర్థులూ బాలురే కావడం. తెలంగాణకు చెందిన వివాన్ శరద్ మహిశ్వరి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్ 100 పర్సంటైల్‌తో అగ్రస్థానాల్లో నిలిచారు. మహిత్ ఒబిసి ఎన్‌సీఎల్ కేటగిరీలో టాపర్‌గా నిలవగా, మోహిత్ మరియు వివాన్ జనరల్ కేటగిరీలో టాప్ స్కోర్లు సాధించారు.

దేశవ్యాప్తంగా జెఇఇ మెయిన్ పరీక్షలకు 13,55,293 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 13,04,653 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎన్‌టిఎ తెలిపింది. అంటే 96.26 శాతం హాజరు నమోదైంది. ప్రస్తుతం రెండో విడత పరీక్షలకు

(మిగతా 2వ పేజీలో)



## సీఎం రేవంత్‌కు సుప్రీంలో ఉపశమనం


- 2016 ఎఫ్ఐఆర్‌పై సుప్రీం తుది నిర్ణయం
- హైకోర్టు తీర్పు సముచితమేనని వ్యాఖ్య
- ప్రాథమిక సాక్ష్యాలు లేవని స్పష్టం
- పిటిషన్‌ను తోసిపుచ్చిన న్యాయస్థానం

న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో కీలక న్యాయ ఉపశమనం లభించింది. 2016లో ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో హైకోర్టు నిర్ణయం సముచితంగానే ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. అప్పట్లో ఎస్‌సి/ఎస్‌టి చట్టం, ఐపిసి నిబంధనల కింద

(మిగతా 2వ పేజీలో)

## అమరావతిలో చంద్రబాబుతో మంత్రి తుమ్మల భేటీ

- భద్రాచలం పరిసర ఐదు గ్రామాల విలీనంపై విజ్ఞప్తి
- పరిపాలనా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులు
- సాగునీటి ప్రాజెక్ట్ మరమ్మత్తులకు 85:15 నిష్పత్తి ప్రతిపాదన
- దేవాలయాలు, రైల్వే, యాత్రికుల సౌకర్యాలపై చర్చలు
- అంతర్రాష్ట్ర సమన్వయంతో అభివృద్ధి సాధ్యమని అభిప్రాయం



అమరావతి : రాష్ట్ర పునర్విభజన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ పరిధిలోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేసే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం అవసరమని

(మిగతా 2వ పేజీలో)



## కాంగ్రెస్‌లో కొనసాగాలా? వద్దా: జీవన్‌రెడ్డి

- చైర్‌పర్సన్ ఎంపికపై అసంతృప్తి వెల్లడి
- పార్టీలో అన్యాయం జరుగుతోందని ఆవేదన
- కార్యకర్తల కష్టానికి గౌరవం లేదని విమర్శ
- కొనసాగాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నానని వ్యాఖ్య
- జగిత్యాల రాజకీయాల్లో వర్గ పోరు బహిర్గతం

# 4 రోజులపాటు ఇంట్లోనే మృతదేహం

- బయట తలుపుకు తాళం వేసి కుటుంబ సభ్యుల ప్రార్థనలు
- దుర్వాసనతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు
- పోలీసులు నచ్చజెప్పి మృతదేహం తరలింపు
- కైకలూరికి అంబులెన్స్‌లో తరలించిన కుటుంబం




హైదరాబాద్: హైదరాబాద్‌లోని మూసాపేట పరిధిలో విచిత్ర ఘటన చోటుచేసుకుంది. ఒక కుటుంబం మృతదేహాన్ని నాలుగు రోజులపాటు ఇంట్లోనే ఉంచుకుని ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో దుర్వాసన రావటంతో విషయం బయటపడింది. వివేకానందనగర్‌లోని రామకృష్ణనగర్ వీధిలో ఉన్న శ్రీ సాయి భరద్వాజ్ అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో తల్లి శమంతకమణి తన ముగ్గురు పిల్లలు జయరాం, శైలజ, సునీతలతో అద్దె ఇంట్లో నివసిస్తోంది. భర్త రిటైర్డ్ ఎస్ఐగా

(మిగతా 2వ పేజీలో)



## మోదీ-మేక్రాన్ భేటీకి ముంబై వేదిక

- వ్యూహాత్మక భాగస్వామ్యంపై సమీక్ష
- కొత్త రంగాల్లో సహకార విస్తరణపై దృష్టి
- 'ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్ 2026' ఆవిష్కరణ
- ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు
- పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లతో సంభాషణ

వాయిస్ టుడే

మంగళవారం, ఫిబ్రవరి 17, 2026

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలు: కెటిఆర్

కిడ్నాప్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆరోపించారు. అధికారులు, పోలీసులు అధికార పార్టీ నేతలతో కలిసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని తొర్రూర్, జనగామ, క్యాతనపల్లి, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన పరిణామాలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా ఎంపీలు, ఎమ్మెల్యేలే గెలిచిన ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావడం, దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా ఛైర్మన్ల ఎంపిక ప్రక్రియలో జోక్యం చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. ఎక్స్ అఫీషియో ఓట్ల పేరిట దొంగ ఓట్లను నమోదు చేసి పదవులను దక్కించుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై మాయని మచ్చగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. కోరం ఉన్న చోట్ల కూడా అధికార పార్టీ ఒత్తిడితో ఎన్నికలను వాయిదా వేయడం ఎన్నికల సంఘం పనితీరుపై అనుమానాలు కలిగిస్తోందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర డిజిపి తక్షణమే జోక్యం చేసుకొని కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం కూడా వెంటనే స్పందించి అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అక్రమ కిడ్నాప్‌లు, దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి ప్రజాస్వామ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. హంగ్ మున్సిపాలిటీల్లో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అప్రమత్తమై కీలక పట్టణాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లను నియమించిందన్నారు. స్థానిక నాయకత్వంతో సంప్రదింపులు జరిపి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ అరాచకాల మధ్య పార్టీ శ్రేణులకు అండగా నిలిచి ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు.





## బీజేపీకి మేయర్ పదవి దక్కకుండా కుట్రల : బండి సంజయ్

రాజకీయంగా కెలికినట్టు ఆరోపిస్తూ ఇకపై బీజేపీని అడ్డుకునే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. కరీంనగర్ మున్సిపల్ ఎన్నికలను కబడ్డీ ఆటతో పోల్చుతూ అన్ని కుట్రలను ఎదుర్కొని బీజేపీ విజయాన్ని సాధించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసి ఎందుకు వ్యవహరిస్తున్నాయో ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఫాంహౌస్ రాజకీయాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే కుట్రలు జరిగాయని ఆరోపించారు. ప్రజల తీర్పును వక్రీకరించే ప్రయత్నాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆందోళనకరమని అన్నారు. కాంగ్రెస్ 14 సీట్లు, ఎంఐఎం 3, బీఆర్ఎస్ 9 సీట్లు గెలిచినప్పటికీ మ్యాజిక్ ఫిగర్ దాటలేదని, అయినప్పటికీ బీజేపీని అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని విమర్శించారు. రెండు రోజులుగా జరిగిన రాజకీయ పరిణామాలను చూసి ప్రజలే విస్తుపోయారని వ్యాఖ్యానించారు. ఈ మొత్తం వ్యవహారంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల వైఖరి గమనించదగ్గదని, ప్రజాస్వామ్య తీర్పును గౌరవిస్తూ పార్టీ నిర్ణయాలకు భిన్నంగా వ్యవహరించిన తీరు ప్రశంసనీయమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే కుట్రలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని, రాజకీయ అరాచకాలకు బీజేపీ బలమైన సమాధానం ఇస్తుందని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## పట్టణ పాలనపై కాంగ్రెస్ పట్టు

పాల్గొని పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రతికూల ఫలితాలు వచ్చిన చోట్ల కూడా కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ముఖ్యంగా ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పరిస్థితులను అంచనా వేసి మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకునేలా పావులు కదిలించింది. నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, పాలమూరు జిల్లాల్లో అధిక శాతం స్థానాలను దక్కించుకుంది. నిజామాబాద్ కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా పట్టుపట్టి గెలుచుకోవడంలో సీనియర్ నాయకులు కీలక పాత్ర పోషించగా, కొత్తగూడెం మేయర్ పదవిని మిత్రపక్షమైన సీపీఐకి ఇవ్వడం ద్వారా భవిష్యత్ రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకున్నట్లు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి. పుర పీఠాల్లో అధిక శాతం బీసీ వర్గాలకు అవకాశం కల్పించామని కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పదవి విషయంలో వ్యూహాత్మక లోపాలు చోటుచేసుకున్నాయని, దీనిపై సమీక్ష చేపడతామని వెల్లడించారు.

## జెఇఇ మెయిన్ ఫలితాల్లో తెలుగు విద్యార్థుల ప్రతిభ

దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఏప్రిల్ 2 నుంచి 9 వరకు రెండో విడత పరీక్షలు నిర్వహించనుండగా, రెండు విడతల్లో సాధించిన ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని తుది ర్యాంకులను కేటాయిస్తారు. అనంతరం సామాజిక వర్గాల వారీగా సుమారు 2.5 లక్షల మందికి జెఇఇ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చూపిన వారికి జోసా కౌన్సిలింగ్ ద్వారా ఐఐటీల్లో ప్రవేశాలు కల్పించబడతాయి.

## సీఎం రేవంత్‌కు సుప్రీంలో ఉపశమన

నమోదైన కేసులో ముఖ్యమంత్రిపై ప్రత్యక్ష సాక్షాధారాలు లేవని హైకోర్టు పరిశీలించి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జాయ్‌మాల్యా, విపుల్ ఎం పంచోలీతో కూడిన ధర్మాసనం కేసు పూర్వాపరాలను సమగ్రంగా పరిశీలించినట్లు వెల్లడించింది. రెండవ ప్రతివాదిగా పేర్కొన్న వ్యక్తిపై కేసు నమోదు చేయడానికి అవసరమైన ప్రాథమిక ఆధారాలు లేవని హైకోర్టు చేసిన నిర్ధారణ సరైనదేనని అభిప్రాయపడింది. ఈ నిర్ణయాన్ని క్లీన్‌చిట్‌గా భావించరాదని, కానీ న్యాయపరమైన పరిశీలన అనంతరం వచ్చిన తీర్పు సబబేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాజకీయ కక్షలు తీర్చుకునేందుకు న్యాయస్థానాలను వేదికగా ఉపయోగించకూడదని ఈ సందర్భంగా న్యాయమూర్తులు సూచించారు. గతంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో భూవివాదం, కులవివక్ష ఆరోపణలతో ఫిర్యాదు దాఖలైన విషయం గుర్తుచేశారు. అనంతరం విచారణలో ముఖ్యమంత్రి పాత్రకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు లేవని గుర్తించిన హైకోర్టు ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది. ఆ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై వాదనలు వినిపించిన తరువాత సుప్రీంకోర్టు హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. కేసుకు సంబంధించి అన్ని అంశాలను పరిశీలించిన తరువాత పిటిషన్‌లో సరైన ఆధారాలు లేవని గుర్తించి దానిని తోసిపుచ్చింది. ఇలాంటి విషయాలను అనవసరంగా అత్యున్నత న్యాయస్థానానికి తీసుకురావద్దని పిటిషనర్‌ను మందించినట్లు కూడా ధర్మాసనం పేర్కొంది.

## 4 రోజులపాటు ఇంట్లోనే మృతదేహం




పనిచేసి ఇప్పటికే మరణించగా, ఆయన పింఛన్‌తో కుటుంబం జీవనం సాగిస్తోంది. ముగ్గురు పిల్లలు కూడా వివాహం కాకుండానే తల్లితో ఉంటున్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న కుమార్తె శైలజ (50) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు తలుపుకు తాళం వేసుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ఇంట్లోనే ఉంచుకున్నారు. ఇంటి నుంచి దుర్వాసన రావటంతో అనుమానం వచ్చిన స్థానికులు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని తలుపు తట్టగా సోమవారం కార్యక్రమం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు చెప్పి తలుపు మూసుకున్నారు. అయితే మరుసటి రోజుకూడా మృతదేహాన్ని అలాగే ఉంచటంతో దుర్వాసన మరింత ఎక్కువైంది. దీంతో పోలీసులు మళ్లీ వెళ్లి మృతదేహాన్ని తరలించాలని సూచించారు. పోలీసులు పలు విధాలుగా వారికి నచ్చజెప్పిన అనంతరం కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. చివరకు మృతదేహాన్ని అంబులెన్స్‌లో వారి స్వగ్రామమైన కైకలూరుకు తరలించారు. ఇదిలా ఉండగా గతంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మన్‌పై దాడి చేసిన ఘటనలో కూడా ఇదే కుటుంబం ప్రమేయం ఉందని, అద్దె చెల్లింపుల విషయంలోనూ సమస్యలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

# అమరావతిలో చంద్రబాబుతో మంత్రి తుమ్మల భేటీ

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయిన మంత్రి, ఖమ్మం జిల్లా సాగునీటి వసతులు, ప్రజా సౌకర్యాలకు సంబంధించిన పలు కీలక విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామాలు భౌగోళికంగా తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉండటం వల్ల అక్కడి ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఉన్న ఈ గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంక్లేవ్‌లుగా మారిపోయాయని, జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి ప్రజలు దాదాపు ఎనిమిది గంటల పాటు ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా అనుసంధానం లోపం, భద్రతా సమస్యలు స్థానిక గిరిజనుల జీవన విధానంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి సంబంధించిన కొంత భూభాగం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటంతో దేవస్థానం పరిపాలనలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రి తెలిపారు. భక్తులకు మెరుగైన సేవలు అందించాలంటే గ్రామాల విలీనం అవసరమని, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఇది కీలక చర్య అవుతుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్‌కు శాశ్వత మరమ్మత్తులు అత్యవసరమని మంత్రి సూచించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 16 వేల ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందులో 13,640 ఎకరాలు ఆంధ్రప్రదేశ్‌లో, 2,360 ఎకరాలు తెలంగాణలో ఉన్నాయని వివరించారు. రెండు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగే ఈ ప్రాజెక్ట్ పునరుద్ధరణకు సుమారు రూ.92.20 కోట్ల వ్యయం అంచనా ఉండగా, ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల జీవనాధారం ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడినందున తక్షణ ఆర్థిక సహకారం అవసరమని విజ్ఞప్తి చేశారు. గోదావరి వరద రక్షణ కరకట్టలో మూడవ స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్న విషయాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. భద్రాచలం పట్టణాన్ని వరదల నుంచి రక్షించే రక్షణ గోడ విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో నిర్వహణలో సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే ఏపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు జరగలేదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా తక్షణ



సాంకేతిక పరిశీలనతో పాటు తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టి, రెండు రాష్ట్రాల సమన్వయంతో శాశ్వత పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని కోరారు. ఖమ్మం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి అవసరమైన భూమి గుర్తింపు పూర్తయిందని, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రి సూచించారు. తిరుమలలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మాణానికి సుమారు ఐదు ఎకరాల భూమి కేటాయించాలని ప్రతిపాదించారు. అలాగే సత్తుపల్లికొవ్వూరు, పెనుబల్లిఅమరావతి రైల్వే లైన్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. రెండు రాష్ట్రాల పరస్పర సహకారం పెరిగితే సాగునీరు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణలో వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# మోదీ-మేక్రాన్ భేటీకి ముంబై వేదిక

**వ్యూహాత్మక భాగస్వామ్యంపై సమీక్ష**

**కొత్త రంగాల్లో సహకార విస్తరణపై దృష్టి**

**‘ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్ 2026’ ఆవిష్కరణ**

**ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు**

**పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లతో సంభాషణ**



ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత పర్యటనలో భాగంగా నేడు ముంబైలో ప్రధాని నరేంద్ర మోదీతో కీలక భేటీ కానున్నారు. భారత్‌ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతితో పాటు ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై అగ్రనేతలు సమగ్ర సమీక్ష చేపట్టనున్నారు. ఇరుదేశాల మధ్య రక్షణ, సాంకేతికత, ఆవిష్కరణలు, నూతనంగా ఉద్భవిస్తున్న రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకునే దిశగా చర్చలు జరగనున్నట్లు కేంద్ర వర్గాలు తెలిపాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యాంశాలపై కూడా నేతలు అభిప్రాయాలను పంచుకోనున్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారిక ప్రకటన ప్రకారం, ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి ముంబై చేరుకున్న అనంతరం మేక్రాన్‌తో చర్చలు ప్రారంభిస్తారు. ముంబైలోని లోక్‌భవన్‌లో మధ్యాహ్నం 3.15 గంటలకు ఈ ద్వైపాక్షిక సమావేశం జరగనుంది. అనంతరం సాయంత్రం 5.15 గంటలకు ఇండియాఫ్రాన్స్ ‘ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్ 2026’ కార్యక్రమాన్ని సంయుక్తంగా ఆవిష్కరించనున్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొనాలని ప్రధాని మోదీ ఆహ్వానించడంతో మేక్రాన్ భారత పర్యటనకు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఢిల్లీకి ఆయన రావడం ఇది నాలుగోసారి కాగా, ముంబై పర్యటన మాత్రం ఇదే మొదటిసారి కావడం విశేషం. భేటీ అనంతరం ఇరుదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ సంస్థలు, పరిశోధకులు, ఆవిష్కర్తలను ఉద్దేశించి ఇద్దరు నాయకులు ప్రసంగించనున్నారు. ఈ సమావేశం ద్వారా భారత్‌ఫ్రాన్స్ వ్యూహాత్మక బంధం మరింత బలోపేతం అవుతుందనే అభిప్రాయం దౌత్య వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# కాంగ్రెస్‌లో కొనసాగాలా? వద్దా: జీవన్‌రెడ్డి



**చైర్‌పర్సన్ ఎంపికపై అసంతృప్తి వెల్లడి**

**పార్టీలో అన్యాయం జరుగుతోందని ఆవేదన**

**కార్యకర్తల కష్టానికి గౌరవం లేదని విమర్శ**

**కొనసాగాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నానని వ్యాఖ్య**

**జగిత్యాల రాజకీయాల్లో వర్గ పోరు బహిర్గతం**

జగిత్యాల: జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలు మరోసారి బహిర్గతమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంపిక వ్యవహారంపై కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని తాను మొదటి నుంచీ కోరుతున్నప్పటికీ తమ అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ పదవి దక్కినందుకు సంతోషించాలా లేక బాధపడాలా అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేను కలిసిన కొద్ది రోజుల్లోనే ఒక వ్యక్తి చైర్‌పర్సన్ పదవిలో కూర్చోవడం తనను బాధించిందని తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలోనే పని చేయాల్సిన పరిస్థితి ఉంటే ఇంకా కాంగ్రెస్‌లో కొనసాగాలా అనే సందేహం కలుగుతోందని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వాలని, అభివృద్ధి పేరుతో పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం ఎందుకని ప్రశ్నించారు. పార్టీలో అన్యాయం జరిగిన వారికే తాను మద్దతు ఇచ్చానని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం తమ వర్గంపై వేధింపులు కొనసాగుతాయని ఆరోపించారు. ఇన్ని అవమానాలు ఎదుర్కొంటూ పార్టీలో కొనసాగడం గురించి ఆలోచించే పరిస్థితి ఏర్పడిందని, కొనసాగాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా చైర్‌పర్సన్ ఎన్నికకు కనీసం 25 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 23 స్థానాలు గెలుచుకోగా, స్వతంత్రులు 15 చోట్ల విజయం సాధించారు. బీజేపీ ఆరు, బీఆర్ఎస్ నాలుగు, ఎంఐఎం రెండు స్థానాలు దక్కించుకున్నాయి. ఈ పరిస్థితుల్లో చైర్‌పర్సన్ పీఠం కోసం జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గాల మధ్య పోటీ నెలకొంది. ఇద్దరి వర్గాల మధ్య పోటీ తీవ్రతరమవడంతో పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని పలు దఫాలుగా చర్చలు జరిపింది. చివరకు సంజయ్ వర్గానికి చైర్‌పర్సన్ పదవి అప్పగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ పరిణామం పట్ల జీవన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేయడంతో కాంగ్రెస్‌లో వర్గ రాజకీయాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# మహిళా అభివృద్ధికి కుటుంబ సహకారమే బలం: అలేఖ్య పుంజాల




హైదరాబాద్, ఫిబ్రవరి 16: (వాయిస్ టుడే): మహిళలు సమాజంలో ముందుకు రావాలంటే కుటుంబ సభ్యుల సహకారం అత్యంత కీలకమని అలేఖ్య పుంజాల పేర్కొన్నారు. మహిళల సాధికారతే సమాజ మార్పు మరియు స్థిరమైన అభివృద్ధికి పునాది అని ఆమె అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో నిర్వహించిన Munnuru Kapu Association of North America (MANA) సమావేశంలో మాట్లాడుతూ, మహిళలు విద్య, వైద్యం, పరిశ్రమలు, ప్రజాసేవ, సాంస్కృతిక రంగాలతో సహా అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తుండటం సమాజంలో సానుకూల మార్పుకు సంకేతమని తెలిపారు. మహిళల ఆత్మవిశ్వాసం పెరుగుతోందని, కుటుంబాలు కూడా వారి లక్ష్యాలకు మద్దతు ఇవ్వడం ప్రారంభించాయని ఆమె పేర్కొన్నారు.

"మహిళల పురోగతికి కుటుంబ సహకారం చాలా అవసరం. అదే సమయంలో మహిళలు తమ వృత్తి లక్ష్యాలు మరియు కుటుంబ బాధ్యతల మధ్య సమతుల్యతను కాపాడుకోవాలి. ఆ సమతుల్యమే సంపూర్ణ అభివృద్ధికి దారి తీస్తుంది," అని ఆమె అన్నారు. యువతిలో నాయకత్వ లక్షణాలు పెంచేందుకు సమాజ సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కూడా సూచించారు. ఈ సందర్భంగా హీూచీూ లక్ష్యాలకు అనుగుణంగా నాలుగు అంశాలపై నిర్వహించిన ప్యానెల్ చర్చల్లో ప్రొఫెసర్ వి. వెంకటరమణ, మణికొండ వెంకటేశ్వరరావు, డా. దీపాల గంగాధర్, డా. బి.పీ. పడాల, ఎక్కా రాజేందర్ పాల్గొని ప్రసంగించారు. విద్యావకాశాలు, ఉద్యోగ మార్గదర్శకత్వం, విదేశీ విద్య, సమాజ సేవ వంటి అంశాలపై చర్చలు జరిగాయి. MANA అధ్యక్షురాలు రమా ముడిచింతల మాట్లాడుతూ, సంస్థ లాభాపేక్షలేని వేదికగా వ్యక్తుల సాధికారతతో పాటు ప్రపంచవ్యాప్తంగా మున్నూరు కాపు సమాజాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు.

"విద్య మరియు సాధికారత మా ప్రధాన ధ్యేయాలు. అదనంగా మ్యాట్రిమోనీ, ఇమ్మిగ్రేషన్ మార్గదర్శకత్వం, అమెరికాలో విద్యార్థులకు సహాయం వంటి సేవలు అందిస్తున్నాం. గత మూడు సంవత్సరాల్లో 30కిపైగా సమావేశాలు నిర్వహించి సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చాం," అని ఆమె వివరించారు. త్వరలో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ మరియు మెంటర్‌షిప్ కార్యక్రమాలను ప్రారంభించే యోచనలో ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రమేష్ మగంటి, జాతీయ ఈవెంట్ కోఆర్డినేటర్ అనిల్ ముడిచింతల, చీఫ్ కోఆర్డినేటర్ సుంకరి రామ్ మూర్తి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సభ్యులు సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు. వాలెడిక్టరీ సభలో ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ మరియు సామాజిక నాయకుడు డా. వినయ్ కుమార్ ప్రసంగిస్తూ, హీూచీూ కార్యకలాపాలను అమెరికా వ్యాప్తంగా విస్తరించాలని సూచించారు. అలాగే American Telugu Association మరియు Telugu Association of North America స్థాయిలో సంస్థను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఆర్ఐ సంస్థల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో, సమిష్టి కృషితో హీూచీూ తెలంగాణలో కూడా శక్తివంతమైన వేదికగా ఎదగగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మహిళా సాధికారత, విద్యార్థుల సహాయం, సామాజిక సేవ కార్యక్రమాలపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## పుప్పాల ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి సందర్భంగా ఘనంగా బాక్స్ క్రికెట్ టోర్నమెంట్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి16(వాయిస్ టుడే ): పుప్పాల ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో ఘనంగా బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పుప్పాల ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించబడింది. ఈ టోర్నమెంట్‌లో 46 చురుకైన మరియు ఉత్సాహభరితమైన జట్లు పాల్గొని క్రీడాస్ఫూర్తితో పోటీపడ్డాయి. ఈ కార్యక్రమం యువతలో ఐక్యత, ఆరోగ్యం, క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. టోర్నమెంట్ చివర్లో విజేత జట్టుకు రూ.20,000 నగదు బహుమతి మరియు ట్రోఫీ, అలాగే రన్నర్ జట్టుకు రూ.10,000 నగదు బహుమతి మరియు ట్రోఫీలను జిహెచ్ఎంసి డివిజన్ ప్రెసిడెంట్ శ్రీ పుప్పాల భాస్కర్ చేతుల మీదుగా అందజేశారు. ఆయన హాజరు మరియు సహకారం ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చింది.

ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రసాద్ నాయుడు, అరుణ్, యల్లేష్ మరియు ముకేష్ మాట్లాడుతూ, పోటీల్లో పాల్గొన్న అన్ని జట్లకు, స్వచ్ఛంద సేవకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ, ఇలాంటి సామాజిక కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ఘనవిజయంగా నిర్వహించేందుకు సహకరించిన జంకిరాములు , పాల కృష్ణ , పోల్ శ్రీకాంత్ , నేటి రాజు , కోల శ్రీకాంత్ , తాటి రవి , ముకుంద్ రావు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం క్రీడాస్ఫూర్తి, ఐక్యత మరియు ఆనందోత్సాహాల మధ్య మహా శివరాత్రిని ఘనంగా జరుపుకుంటూ విజయవంతంగా ముగిసింది.



## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సీఎం క్రిస్మస్ విందుకు ఆహ్వానించి కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పాస్టర్స మరియు క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 16(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లు నుండి వచ్చిన పాస్టర్స్ మరియు క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తున్న సీఎం క్రిస్మస్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరవ్వాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ మరియు క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు గొడి శేఖర్, రవికుమార్, సంజీవ్ కుమార్, క్రిష్ దాస్, డేవిడ్ శెట్టి,ఏసురత్నం, సుధాకర్, స్వీట్ బాబు మరియు వివిధ డివిజన్లో గల పాస్టర్స్ మరియు క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి: జెడ్సీ హేమంత్ బోర్ఖడే

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే): శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయం తోపాటు నర్సింగ్, అమెన్పూర్, పటాన్చెరువు, మియాపూర్ శేరిలింగంపల్లి సర్కిల్లో అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కాగా మొత్తం 24 వినతులు అధికారులకు అందాయి .ఇందులో జోనల్ కార్యాలయంలో 5, శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 8, నర్సింగ్ సర్కిల్ కార్యాలయంలో 3 , మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో 5 మరియు అమీన్పూర్ సర్కిల్ 3 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్ కు సంబంధించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యతగా భావించి క్షేత్రస్థాయి పరిశీలనలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి తీసుకున్న చర్యలను తిరిగి ప్రజలకు నివేదించాలని జోనల్ కమిషనర్ సూచించారు. జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే ఆయా విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణిలో వినతులను స్వీకరించారు.

## కొత్తగూడెం స్ఫూర్తితో గుట్టలో ఎర్రజెండాను ఎగురవేయడం ఖాయం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 16(వాయిస్ టుడే ): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను బట్టి ప్రజలు సిపిఐ ని కోరుకుంటున్నారని దానికి నిదర్శనం కొత్తగూడెం కార్పొరేషన్ లో ఏ పార్టీలతో పొత్తు లేకుండా సిపిఐ ఒంటరిగా పోరాటం చేసి 60 సీట్ల గాను 23 సీట్లు గెలుచుకొని అతిపెద్ద పార్టీగా ఏర్పడిందని దాన్ని గుర్తించి అటు కాంగ్రెస్ పార్టీ, ఇటు బి ఆర్ ఎస్ పార్టీ కొత్తగూడెంలో మేయర్ ఎన్నికలకు సిపిఐ కి సంపూర్ణ మద్దతును తెలియజేసిందని ఈ గెలుపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి కమ్యూనిస్టులకు స్ఫూర్తిదాయకమైనదని అన్నారు. ఈ సందర్భంగా సిపిఐ విజయం సాధించినందుకు జగద్గిరిగుట్ట కార్యాలయం వద్ద స్వీట్లు పంచుకొని విజయోత్సవ సంబరాలను నిర్వహించడం జరిగింది, ప్రత్యర్థి పార్టీలు ముఖ్యంగా కాంగ్రెస్,టీఆర్ఎస్, బిజెపి పార్టీలు ఓటర్లకు లక్షలాది రూపాలను పంచినప్పటికీ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలతోనే సిపిఐ పార్టీ ఉన్నందువల్ల ప్రజలు డబ్బుకు కులానికి మతానికి లొంగకుండా సిపిఐ పార్టీకి ఓటు వేసి గెలిపించారని అన్నారు. జగద్గిరిగుట్ట లో కూడా సిపిఐ ప్రజల నాలుకలో నిత్యం ఉంటూ అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాడి విజయం సాధించిందన, ఇవాళ జగద్గిరిగుట్టలో బస్తీ దావఖానా, రోడ్డు వెడల్పు, ప్రభుత్వ వైద్యశాల లాంటివి ఏర్పాటు కోసం పోరాటం చేసి విజయం సాధించిందని అదేవిధంగా పరికిచెరువు పరిరక్షణ కొరకు, లక్ష్మీ వెంకటేశ్వర స్వామి భూముల పరిరక్షణ కొరకు, బస్ డిపో ఏర్పాటు కొరకు సిపిఐ పోరాటాలను నిర్వహిస్తున్నదని అందుకే రానున్న ఎన్నికల్లో జగద్గిరిగుట్ట ప్రజలు కూడా సిపిఐ ని గెలిపిస్తారని అన్నారు. సిపిఐ పార్టీని గెలిపించడానికి నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి పని చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి ఏఐవైఎఫ్ కార్యదర్శి వెంకటేష్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు సిపిఐ నాయకులు సదానంద్, కే వెంకటేష్, ఏం సహదేవరెడ్డి, ఏ కృష్ణ, నాగేష్ చారి, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ చారి, సామిల్,రవి, జానకి రామ్, ఇమామ్, నారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది.



## శ్రీశ్రీశ్రీ భవాని శంకరలాయ వారిసికోత్సవ వేడుకలో పాల్గొన్న మారబోయిన అనిల్ యాదవ్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 16(వాయిస్ టుడే): శ్రీశ్రీశ్రీ భవాని శంకరలాయం 19వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం కన్నుల పండువగా జరిగాయి. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో పూజించారు. నల్లగశీడ్ల కి చెందిన బొల్లంపల్లి సత్యనారాయణ రెడ్డి మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలో పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారినీ కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## విజయవంతంగా ఆర్.వి పౌండేషన్ క్రికెట్ పోటీలు

### అధిక సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్ విజయవంతం చేసిన యువకులకు తుంగతుర్తి రవి కృతజ్ఞతలు.

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, ఫిబ్రవరి 16 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడలో బాక్స్ క్రికెట్ పోటీలు ఘనంగా నిర్వహించారు. అనేక వైద్య,సేవా కార్యక్రమాలతో యువకుల కోసం క్రికెట్ నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవిని పలువురు అభినందించారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ, యువతలో క్రీడా నైపుణ్యాన్ని, పెంపొందించేందుకు మహాశివరాత్రి జాగరణ సందర్భంగా బాక్స్ క్రికెట్ పోటీలు నిర్వహించామని, ఈ పోటీలోని విజేత టీం పిర్జాదిగూడ 20,000/- నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ అప్ టీం రెడ్ స్కోరపియన్స్ 10,000/- రూపాయల నగదుతో పాటు ట్రోఫీ, బెస్ట్ బ్యాట్స్మెన్ సమీర్, బెస్ట్ బౌలర్ రాహుల్ లకు ప్రత్యేక బహుమతులు అందించామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ మరియు మాజీ కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ 26 డివిజన్ ల ఇంచార్జ్ లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు మరియు మేడిపల్లి, పీర్జాదిగూడ, పర్వతాపూర్ యువకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఐఏఎస్‌కు వినతిపత్రం

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, ఫిబ్రవరి 16 : తెలంగాణ సచివాలయంలో రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు శాఖ) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు IASను తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సి. ప్రభాకర్ రావు ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం, నారపల్లి మరియు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రజలు, బిల్డర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు వివరించారు. పెరుగుతున్న రియల్ ఎస్టేట్ లావాదేవీలను దృష్టిలో పెట్టుకుని స్లాట్ల సంఖ్యను పెంచాలని, సాఫ్ట్‌వేర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంపై స్పందించిన ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, వారం రోజుల్లో నారపల్లి సహా అవసరమున్న ఇతర రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే సాఫ్ట్‌వేర్ లోపాలు తలెత్తకుండా తగిన సాంకేతిక చర్యలు చేపడతామని తెలిపారు. త్వరలోనే రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని బిల్డర్స్ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో గ్రేటర్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జెటీ విద్యాసాగర్, ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ, అడ్వైజర్ ఎస్. రమేష్, వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె. రాజారెడ్డి తదితర సభ్యులు పాల్గొన్నారు.



## అలియాబాద్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 16(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అలియాబాద్ మున్సిపాలిటీ ఇంచార్జిగా వ్యవహరించగా గెలుపొందిన కౌన్సిలర్లకు, అలాగే చైర్మన్‌గా ఎన్నికైన కంటం శిరీష కృష్ణ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలియాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మైసిగారి శ్రీనివాస్, కొలన్ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.




## పదవీ బాధ్యతలు స్వీకరించిన మున్నూరు కాపు ప్రజాప్రతినిధులకు పిల్లి శ్రీనివాస్ రావు శుభాకాంక్షలు

హైదరాబాద్ : ఫిబ్రవరి 16(వాయిస్ టుడే ): తెలంగాణ రాష్ట్రంలో నేడు కార్పొరేటర్లుగా, మేయర్లుగా, డిప్యూటీ మేయర్లుగా, మునిసిపల్ కౌన్సిలర్లుగా, చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అన్ని ప్రజాప్రతినిధులకు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్ రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా పారదర్శక పాలన అందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ప్రజాసేవే ప్రధాన ధ్యేయంగా తీసుకుని ప్రతి వార్డులో, ప్రతి పట్టణంలో సమగ్ర అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.మున్నూరు కాపు మహాసభ కార్యవర్గం తరపున మున్నూరు కాపు ముద్దుబిడ్డలందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
మంగళవారం 17 ఫిబ్రవరి 2026



## శ్రీ రామలింగేశ్వర స్వామి కృప ప్రజలందరిపై ఉండాలి

### ప్రతి శివరాత్రికి దర్శనానికి వచ్చే భక్తులకు అన్న సమారాధన చేయడం అభినందనీయం

### మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం రావు పటేల్

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 16(వాయిస్ టుడే): శ్రీ రామలింగేశ్వర స్వామి దయవలన ఈ సంవత్సరం ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం రావు పటేల్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీ రామలింగేశ్వర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కీసర మండల మున్నూరు కాపు సంఘం సభ్యులు అధ్యక్షుడు చిన్న మహేందర్ పటేల్, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి వెంకటేశ్వర్ పటేల్, కోశాధికారి రమేష్ పటేల్ శివరాత్రికి దర్శనాని కోసం వచ్చే భక్తులకు అన్నదాన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్నూరుకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం రావు పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్వత సతీష్ కుమార్ పటేల్ ముఖ్య అతిథులుగా హాజరై భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రతి శివరాత్రికి దర్శనాని కోసం వచ్చే భక్తులకు అన్న సమారాధాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు వచ్చి వెళ్లే భక్తులందరి పైన ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శులు కర్ర వెంకటేశ్వర్లు పటేల్, కార్య నిర్వహణ కార్యదర్శి ఆకుల సత్యనారాయణ పటేల్, వేల్పుల శ్రీనివాస్ పటేల్, జిల్లా అధ్యక్షులు అల్వారి ప్రదీప్ పటేల్, మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి పంతుల మల్లయ్య పటేల్, ప్రచార కార్యదర్శి పెరుమాల రాజకుమార్ పటేల్, ఏనుగుల వెంకటేశ్వర్లు, లక్కాకుల సురేష్ పటేల్, పుప్పాల లక్ష్మీకాంతయ్య పాల్గొన్నారు.



## పిహెచ్డి కేటగిరీ 2 అడ్మిషన్లలో అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

సికింద్రాబాద్, ఫిబ్రవరి16 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ 2025 సంవత్సరంలో కేటగిరీ 2 పిహెచ్డి అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని నష్టపోయిన విద్యార్థులు గడ్డం ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ. ఓఎస్డి, స్టూడెంట్స్ డీన్, ఓయూ రిజిస్ట్రార్ అడ్మిషన్లలో తీవ్రంగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అధికారులు చేసిన నిర్లక్ష్యం వల్ల అర్హులైన 30 మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సీట్ మ్యాట్రిక్స్ లో లేని నాన్ లోకల్ అభ్యర్థులకు అడ్మిషన్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థుల కన్నా తక్కువ మార్కులు వచ్చిన ఓసీలకు సీట్లు కేటాయించారన్నారు. అవకతవకలకు పాల్పడిన ఓయూ రిజిస్ట్రార్ నరేష్ రెడ్డి,ఓఎస్డి డీన్ ప్రొఫెసర్ జితేందర్ నాయక్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు న్యాయం చేసేందుకు వెంటనే రిటైర్డ్ జడ్జితో నిజ నిర్ధారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చి న్యాయం చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

## అధికారులతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సమీక్ష

### రైలు పట్టాల వద్ద అతిక్రమణపై ప్రత్యేక దృష్టి

### దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే ప్రతినిధి): రైలు పట్టాల వద్ద జరుగుతున్న అతిక్రమణ సంఘటనలపై మరింత అప్రమత్తంగా ఉండాలని, రైళ్ల సురక్షితమైన కార్యకలాపాలు, రోడ్డు ట్రాఫిక్ భద్రతను పటిష్టపరచడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో సోమవారం రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రత కోసం తీసుకోవలసిన చర్యలపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైళ్లు సజావుగా నడవడానికి, లెవల్ క్రాసింగ్‌ల వద్ద భద్రతను పెంచడానికి జోన్ వ్యాప్తంగా చేపట్టిన వివిధ భద్రతా డ్రైవ్‌లపై ప్రధానంగా దృష్టి సారించారు. భద్రతను బలోపేతం చేయడంపై చర్చిస్తూ, నాన్ ఇంటర్ లాకింగ్ లెవల్ క్రాసింగ్‌లను ఆర్.ఓ.బిలు/ఆర్యుబిలతో భర్తీ చేయడానికి , సంబంధిత విభాగాలతో సమన్వయంతో ఖచ్చితమైన ప్రణాళికను ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జనరల్ మేనేజర్, సరుకు రవాణాపై చర్చిస్తూ, లోడ్ చేస్తున్నప్పుడు అవసరమైన అన్ని భద్రతా జాగ్రత్తలు/ భద్రతా మార్గదర్శకాలను పాటించేలా చూసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా చూసుకోవాలని డివిజన్ లను ఆదేశించారు. ఈ విషయంలో, అధికారులు/పర్యవేక్షకులు భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా ప్రైవేట్ సైడింగ్ అధికారులతో సంభాషించాలని ఆదేశించారు. కోచ్‌లు, ప్లాట్‌ఫామ్‌లలో శుభ్రత, పరిశుభ్రతను నిర్ధారించడంపై సమీక్ష నిర్వహించారు. జోన్‌లో అగ్నిమాపక భద్రత, కేబుల్ నష్టాలు, సిగ్నల్ పరికరాల నిర్వహణ పనులపై కూడా ఆయన చర్చించారు. రైల్వే ఆస్తుల భద్రతను పటిష్టపరచడానికి, సమయపాలనను మెరుగుపరచడానికి షెడ్యూల్ ప్రకారం భద్రతా కార్యకలాపాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధాన అధిపతులతో పాటు, సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఏంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# ఓయూలో ప్రతిష్టాత్మక ఏ.ఐ.యు సెంట్రల్ జోన్ వైస్ ఛాన్సలర్ల సదస్సు

### పాల్గొననున్న 100 కు పైగా వీసీలు, విద్యావేత్తలు, విధానరూపకర్తలు...

### ఉన్నత విద్య పై రెండు రోజుల పాటు సాగనున్న మేధోమథనం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా ఉన్నతవిద్య పై ఈ నెల 19, 20 వ తేదీల్లో రెండు రోజులపాటు మేధోమథనం జరగనుంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు), ఉస్మానియా విశ్వవిద్యలయం సంయుక్తంగా సెంట్రల్ జోన్ వైస్ ఛాన్స్ లర్ మీట్ 2026 నిర్వహించనుంది. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సదస్సు ఉద్దేశం, లక్ష్యాలు, కార్యాచరణను వివరించారు. ఆరు రాష్ట్రాల నుంచి దాదాపు 100కు పైగా ఉపకులపతులు, ప్రముఖ విద్యావేత్తలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. క్రియేటింగ్ ఏఐ, క్వాంటమ్ సాంకేతికతతో కూడిన ఉన్నత విద్యా సంస్థల రూపకల్పన అనే అంశంపై ఈ రెండు రోజుల సమావేశాల్లో విస్తృత చర్చ జరగనుందని స్పష్టం చేశారు. ఈ సదస్సును ఓయూ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభిస్తారని ప్రకటించారు.

ఈ సదస్సులో సెంట్రలో జోన్ పరిధిలోని తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన సుమార్ 120 మంది ప్రతినిధులు, వైస్ ఛాన్సర్లు, సీనియార్ విద్యా నిర్వాహకులు పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ప్రొఫెసర్ కుమార్ తెలిపారు.




**సదస్సు ముఖ్య ఉద్దేశాలు**

ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా ప్రధానంగా నాలుగు అంశాలపై ఈ సదస్సు దృష్టి సారిస్తుందని ఓయూ వీసీ పేర్కొన్నారు. నైతికతతో కూడిన పాలన (ఎథికల్ గవర్నెన్స్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బాధ్యతాయుత వినియోగం, విద్యా విధాన సంస్కరణలు. విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సహకారం పై అర్థవంతమైన చర్చ జరుగుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయాల మధ్య సంస్థాగత సహకారాన్ని పెంపొందించడం, పాలనా ప్రమాణాలను మెరుగుపరచడం, జవాబుదారీతనం తో కూడిన సాంకేతికతను ప్రోత్సహించడం, పరిశోధన – ఆవిష్కరణలలో పరస్పర తోడ్పాటును అందించడమే ఈ విద్యా సదస్సు ప్రధాన లక్ష్యమని వివరించారు. భారతదేశంలో ఉన్నత విద్యను భవిష్యత్ సవాళ్లకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఈ సదస్సు ఒక కీలక వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సాంకేతిక చర్చా గీష్ఠులు (టెక్నికల్ సెషన్)**

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో మూడు ప్రధాన సాంకేతిక సెషన్లు.. సెషన్ 1లో ఏఐ ఆధారిత ఉన్నత విద్యలో నైతికత, పారదర్శకత, సెషన్ 2లో నిబంధనలు, పాలనా సంస్కరణలు – సంస్థాగత స్వయం ప్రతిపత్తి, సెషన్ 3లో సమష్టి నాయకత్వం, విద్యా సంస్థల మధ్య సమన్వయం – వనరుల భాగస్వామ్యం పై ప్రత్యేక చర్చా గోష్టులు ఉంటాయన్నారు. వీటితో పాటు, వైస్–ఛాన్సలర్ల ప్రత్యేక 'బిజినెస్ సెషన్'లో ఉన్నత విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చిస్తారని, చర్చల సారాంశం ఆధారంగా జాతీయ స్థాయి ఉన్నత విద్య విధాన రూపకల్పన కోసం ఏఐయూ కు కీలక సిఫార్సులు చేయనున్నామని స్పష్టం చేశారు. వైస్ ఛాన్స లర్స్ మీట్ కు చీఫ్ ప్యాట్రన్ గా ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం వ్యవహరిస్తుండగా.... ప్యాట్రన్లు గా ఏఐయూ అధ్యక్షులు ప్రొఫెసర్ వినయ్ కుమార్ పాఠక్, ఏఐయూ సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిత్తల్ ఉన్నారు. నోడల్ అధికారులుగా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిలప్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, సి.ఎఫ్.ఆర్.డి డైరెక్టర్ ప్రొఫెసర్ ఇ. సుజాత, ఏఐయూ మీటింగ్ డివిజన్ హెడ్ డాక్టర్ విజేంద్ర కుమార్ లు వ్యవహరిస్తున్నారు. ఈ సమావేశంలో ఏఐయూ కో ప్యాట్రన్లు, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ ఎస్. జితేంద్ర కుమార్ నాయక్ సహా జర్నలిజం విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ కె. స్టీవెన్సన్ ఇతర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## హెచ్.సీ.యూ ల్యాప్‌టాప్‌ల చోరీ కేసును చేదించిన గచ్చిబౌలి పోలీసులు

### ముగ్గురి అరెస్ట్. .60 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే): గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని సీఆర్ రావు ఎఐఎమ్ఎస్ ప్రాంగణంలో జరిగిన 60 ల్యాప్‌టాప్‌ల దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి మొత్తం దొంగిలించిన 60 ల్యాప్‌టాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని గచ్చిబౌలి సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలరాజు తెలిపారు. ఈ ఘటనపై ఈ నెల 9న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో బిఎన్ఎస్ సెక్షన్లు 331(4), 305(ఎ) కింద కేసు నమోదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో నిందితులు కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన రెగుల చంద్ర శేఖర్ (30), అలాగే బీటెక్ చదువుతున్న విద్యార్థులు చెరుకూరి సాయి చరణ్ (19), అశ్విన్ రావు (19)లుగా పోలీసులు వెల్లడించారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వీరిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితులు రాత్రి సమయంలో అక్రమంగా ప్రాంగణంలోకి ప్రవేశించి 60 ల్యాప్‌టాప్‌లను అపహరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం గౌలిదొడ్డి ప్రాంతంలోని నెక్స్ జెన్ హాస్టల్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు నిందితుల వద్ద నుండి మొత్తం దొంగిలించిన ఆస్తిలో భాగంగా 60 ల్యాప్‌టాప్‌లు, మూడు మొబైల్ ఫోన్లు, అలాగే నేరానికి ఉపయోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ పి. నరేష్ దర్యాప్తు చేయగా, గచ్చిబౌలి ఇన్స్పెక్టర్ కె. బాలరాజు మార్గదర్శకత్వంలో, ఏసీపీ జి. వెంకట రమణ గౌడ్, అదనపు డీసీపీ ఎన్. ఉదయ్ రెడ్డి, డీసీపీ శ్రీనివాస్, పర్యవేక్షణలో విచారణ కొనసాగుతుందని పోలీసులు పేర్కొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్



సికింద్రాబాద్ (వాయిస్ టుడే):తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ అన్న ఆదేశానుసారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా భారీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు చెరుకు శివరాజ్ మాట్లాడుతూ, ఫీజు రీయంబర్స్మెంట్ ఆలస్యం కారణంగా వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్టిఫికేట్లు, మార్క్ మెమోలు పొందడంలో సమస్యలు ఎదురవుతున్నాయని, ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫీజు రీయంబర్స్మెంట్ అనేది సంక్షేమ పథకం మాత్రమే కాకుండా విద్యార్థుల హక్కు అని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా స్థిరమైన చెల్లింపు షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విగ్నేష్ రాకేష్ వంశీ కార్తీక్ శివ తరుణ్ సుధాకర్ అవినాష్ విద్యార్థులు పాల్గొని "ఫీజు రీయంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు విద్యార్థి జన సమితి శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని కొనసాగిస్తుందని ప్రకటించింది.



భువనగిరి పట్టణం మున్సిపల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ లను వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రవికుమార్ బాల్య మిత్రులు మండవ శ్రీశైలం,కొండబోయిన జగదీష్‌ల దృశ్యం.

– యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో...
(వాయిస్ టుడే ప్రతినిధి)

# బీసీ వ్యతిరేక దోరణి విడనాడి న్యాయం చేయాలి

### రాజ్యాంగ బద్దమైన హక్కులను కాలరాస్తున్న పాలకులు...

### బీసీ నేత, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య...

### తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ నియామకం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణలో సామాజిక న్యాయానికి చాంపియన్ మేమే అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టం చేసి ఎందుకు అమలు చేయడం లేదని తెలంగాణ బీసీ జేఏసీ ఛైర్మన్ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం విద్యానగర్లోని బీసీ భవన్ లో తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ ను నియమించినట్లు ఆర్. కృష్ణయ్య ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగ బద్దమైన హక్కులను కాలరాస్తున్న పాలకులు బిసి వ్యతిరేక దోరణి ని విడనాడి న్యాయం చేయాలన్నారు. హైకోర్టులో కేసును వాయిదా వేయకుండా




బీసీల పక్షాన బలమైన వాదనలు వినిపించినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ యువత హక్కుల సాధనకు మరో కీలక అడుగు పడిందనీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ ను అధికారికంగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షులు కృష్ణయ్య కి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అండగా నిలిచిన బీసీ మిత్రులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ మాట్లాడుతూ.. బీసీ సమాజం ఎన్నో ఏళ్లుగా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తీవ్ర అన్యాయానికి గురవుతుందని ఆయన పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు పార్టీలకు అతీతంగా రాబోయే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో బీసీ యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సంఘటితంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. బీసీల హక్కుల సాధన, రాజకీయ భాగస్వామ్యం, సామాజిక న్యాయం లక్ష్యంగా జాతీయ బీసీ యువజన సంఘం చేపట్టే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు.

# ఘనంగా శ్రీ మహా శివరాత్రి జాగరణ మహోత్సవ వేడుకలు

## రహీంపుర ప్లే గ్రౌండ్‌లో శివ నామస్మరణలతో వెల్లే విరిసిన ఆధ్యాత్మిక శోభ



హైదరాబాద్, ఫిబ్రవరి 16: వాయిస్ టుడే : శ్రీ మహాశివ రాత్రి జాగరణ మహోత్సవం ఆదివారం రాత్రి రహీంపురా ప్లే గ్రౌండ్ లో అత్యంత వైభవంగా జరిగింది. గత 15 సంవత్సరాలు గా శ్రీ మహాశివ రాత్రి జాగరణ సేవా సమితి అధ్యక్షులు మాడిశెట్టి సదానందం గుప్తా ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. మహాశివ రాత్రి సందర్భంగా జాగరణ లో పలు కార్యక్రమాలు భక్తులను పరవశింప జేశాయి. వేదిక పై వివిధ దేవతా మూర్తుల ప్రత్యేక పూజల అనంతరం జై భవాని కీర్తన్ మండల్ ద్వార భజనలు జరిగాయి. ఢిల్లీ కి చెందిన మౌంటీ నటరాజ్ గ్రూప్ వివిధ దేవతా మూర్తుల వేశాధారనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంకు ముఖ్య అతితిగా ఎంఎల్ సి బొగ్గారపు దయానంద్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, పూస్తే శ్రీకాంత్, సామాజిక వేత ఠాగూర్ గోపాల్ సింగ్, బద్రి సింగ్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, శశి కల కృష్ణ, మంగళాట్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్, బాస్ మాజీ అధ్యక్షులు, క్యాతం రాధాకృష్ణ, సేవా సమితి ప్రధాన కార్యదర్శి రాజన్ కుమార్, కోశాధికారి రంజిత్ కుమార్, అదనపు కోశాధికారి రాజేందర్ సింగ్, ఆర్గనైసింగ్ కార్యదర్శి తోట శ్రవణ్ కుమార్, సలహాదారులు, రవీందర్ సింగ్, శ్రీధర్ బాబు, సత్యనారాయణ, సచిన్ రాజ్ సింగ్, శ్రీధర్ బాబు, సత్యనారాయణ, డి శైలేందర్ సింగ్, గోపాల్ సింగ్, వరప్రసాద్, శ్రీనివాస్, కే నరేష్ గుప్తా, శివ, యాద శ్రీనివాస్ గుప్తా, బ్లరాజ్ గౌడ్, నర్సింలూ గుప్తా, ఐలేన్ గౌడ్, హరీష్, పాండు తదితరులు పాల్గొన్నారు., ఈ సందర్భంగా భక్తులకు, అన్న ప్రసాద వితరణ చేశారు.



## అన్నదానం... ఎంతో పుణ్యకార్యం

### ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే శ్రీరామచంద్రనాయక్

మహబూబాబాద్, ఫిబ్రవరి16: వాయిస్ టుడే : అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అలాంటిది పది మందికి పంచి పెట్టడమే మహాదానమని ప్రభుత్వ చీఫ్ విఫ్, ఎమ్మెల్యే శ్రీరామచంద్ర నాయక్ అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని ఆయన పేర్కొన్నారు. కురవి భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పండుగ సందర్భంగా సోమవారం మహబూబాబాద్ జిల్లా కురవిలో శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అన్ని దానాల్లోకెల్లా అన్నదానం ఎంతో పుణ్యమైందని అన్నారు. ఓ సంస్థను స్థాపించి... గత 10 సంవత్సరాలుగా విజయవంతంగా అన్నదానం నిర్వహించడం ఆషామాషీ కాదన్నారు., ఎంతో సేవా తత్పరరత ఉన్నవారికే అది సాధ్యం అవుతుందన్నారు. కురవి శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు చరిత్రలో ఓ మైలురాయి అని అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంత దానధర్మాలకు కేటాయించాలని సూచించారు. అన్నింటికంటే దైవ కార్యంలో నిమగ్నులవ్వడం కొందరికే వీలవుతుందని, అ కొందరిలో శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ప్రతినిధులు అందిస్తున్న సేవ ఆదర్శప్రాయమన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన, హాజరైన ప్రముఖులను ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ తాము కేవలం నిమిత్త మాత్రులమేనని, అంతా దైవానుగ్రహమేనని తెలిపారు. బంధుమిత్రుల, దాతల సహకారం తమలో సేవాభావాన్ని పెంచిందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె. రవీందర్ రెడ్డి, ఆలయ ఈఓ ఎస్.సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ మేకల దామోదర్ రెడ్డి, ఉత్సవ కమిటి సభ్యులు కాసుల మల్లికార్జున్, డి. జనార్దన్ రెడ్డి, శ్రీ వీరభద్రసేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాసుల వినోద్, కాసుల శ్వేత, శకుంతల, నర్రా దేవేందర్, విజయ్ భారతి, కొండూరు వినోద్ కుమార్, సంజన, విశ్వనాధం, విజయ, సంధ్య, శ్యామ్, అండాలు, రాణి, కాసుల రమణ, స్రవంతి, కాసుల మల్లికార్జున్, స్వాతి, కాసుల చంద్రుడు, లక్ష్మీ, మౌనిక, నర్రా సాయి, కిషోర్, శివాని, తదితరులు పాల్గొన్నారు.

## భార్య, భర్తలే చైర్మన్, వైస్ చైర్మన్




నిర్మల్ , ఫిబ్రవరి 16 : వాయిస్ టుడే : నిర్మల్ మున్సిపాలిటీ రాజకీయ చరిత్రలోనే ఒక అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. నిర్మల్ ఛైర్ పర్సన్ గా అప్పాల కావ్య, వైస్ ఛైర్మన్ ఆమె భర్త అప్పాల గణేష్ చక్రవర్తి సోమవారం ప్రమాణం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన భార్యా భర్తలు మున్సిపల్ కీలక పదవులను దక్కించుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ బలపరిచిన ఈ జంట ప్రమాణ స్వీకారం చేయడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ఆదిలాబాద్ మున్సిపాలిటీలో నెలకొన్న రాజకీయ ఉత్కంఠకు తెరపడింది. మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా 45వ వార్డు స్వతంత్ర అభ్యర్థి బండారి అనూష ఎన్నికయ్యారు. అధికారుల ఆధ్వర్యంలో కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం నిర్వహించిన ఎన్నికలో ఆమెకు 27 మంది సభ్యులు మద్దతుగా నిలిచారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఏంఐఎం పార్టీలతో పాటు ఇతర స్వతంత్ర సభ్యులు అనూషకు మద్దతు తెలపారు. వైస్ చైర్మన్ గా ఏంఐఎం పార్టీకి చెందిన మహమ్మద్ రోహిత్ నీ ఎంపిక చేశారు.

### మంచిర్యాల కార్పొరేషన్ మేయర్‌గా ధరణి మధుకర్

### కేతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా

మంచిర్యాల జిల్లాలోని కేతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ప్రతిష్టంభన ఏర్పడింది. నిర్ణీత సమయం ముగిసినా అభ్యర్థులు హాజరుకాకపోవడంతో ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మందమర్రి తహశీల్దార్ సతీష్ కుమార్ ప్రకటించారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు వేచి చూసినా కౌన్సిలర్లు రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రేపు ఉదయం 11 గంటలకు తిరిగి ఎన్నిక నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

### కాగజ్ నగర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా

కోరం లేకపోవడంతో కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కేవలం 14 మంది సభ్యులు (బీఆర్ఎస్ - 11, ఇండిపెండెంట్ -2, ఎంఐఎం 1)మాత్రమే హాజరయ్యారు. సమావేశం మంగళవారానికి వాయిదా పడింది. గైర్హాజరైన కాంగ్రెస్, బీజేపీ సభ్యులు. మరో ఇద్దరు ఇండిపెండెంట్ సభ్యులు.



## ఖమ్మంలో పగడాలకు ఎంపీ వద్దిరాజు పరామర్శ

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం జిల్లా కారాగారంలో ఉన్న పార్టీ నగర శాఖ అధ్యక్షుడు పగడాల నాగరాజును పరామర్శించారు.ఖమ్మం పోలీసులు ఇటీవల నాగరాజుపై అక్రమ కేసులు బనాయించి జైల్లో వేసిన విషయం తెలిసిందే.ఎంపీ రవిచంద్ర సోమవారం మధ్యాహ్నం ఖమ్మం జిల్లా జైలుకు వెళ్లి నాగరాజును పరామర్శించి మనోధైర్యమిచ్చారు.

## నైజీరియన్ల అనధికార నివాసం... 25 మంది పట్టివేత

గోల్కొండ: టోలిచౌకి ఠాణా పరిధిలోని పారామౌంట్, ఐఏఎస్‌కాలనీల్లో పోలీసులు సోమవారం రాత్రి కట్టడిముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా వీసా గడువు ముగిసినా అక్రమంగా ఇక్కడ నివాసముంటున్నారనే అనుమానంతో నైజీరియన్, సూడాన్, సోమాలియన్, ఇథియోపియా దేశాలకు చెందిన 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఆర్ఆర్ అధికారులతో కలిసి మరోసారి వారి పత్రాలు పరిశీలించిన అనంతరం డిపోర్ట్ చేస్తామని గోల్కొండ జోన్ డీసీపీ చంద్రమోహన్ తెలిపారు. ఈ నెల 28లోపు వీరిని డిపోర్ట్‌చేస్తే జరిమానా లేకుండా చేయవచ్చని, ఇటీవల వచ్చిన కొత్త నిబంధనల ప్రకారం మార్చి 1 నుంచి వీసా గడువు ముగిసినా ఇక్కడ నివసించే వారికి భారీ జరిమానా విధించి డిపోర్ట్ చేయనున్నట్లు డీసీపీ తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన తనిఖీలు రాత్రి 10గంటలకు ముగిసింది. ఇందులో భాగంగా 160 జోనల్ ఫోర్స్, 4 ఏఆర్ ప్లాటూన్ల ఫోర్సు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సమిండ్ల వాణి--శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు



జగిత్యాల (వాయిస్ టుడే) : సమిండ్ల వాణి – శ్రీనివాస్ జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సందర్భంగా, వారికి సహకరించి అవకాశం కల్పించిన గౌరవ జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ , జిల్లా పార్టీ అధ్యక్షులు గాజెంగి నందయ్య కు పార్టీ కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మున్నూరు కాపు సమాజానికి చెందిన రైతు బిడ్డ చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడం గర్వకారణమని, ప్రజల ఆశలు నెరవేర్చే విధంగా మంచి పరిపాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వోడ్నాల రాజశేఖర్, బండారి రాజ్ కుమార్, దీటి అంజయ్య పటేల్, చిక్కుల భూమయ్య, చిట్ల రవీందర్, గంగిలి కృష్ణ నంద రెడ్డి, జంగిలి రవి, బైరం హరి కిరణ్, తీగల వెంకన్న, తీగల శ్రీనివాస్, సమీండ్ల రాజేష్, ముసిపట్ల రవి, నీరటి గంగారెడ్డి, కొలగాని మహేందర్, సమీండ్ల చిరంజీవి, న్యాలం రవీందర్, ముసిపట్ల రాజేందర్, వంగల రమేష్, ముస్కె శీను, చుక్క సతీష్, దిండిగాల శ్రీనివాస్, ఎర్రం చందు, క్యాస రఘునందన్ రెడ్డి, జంగిలి శశి, కడారి రాజేందర్, న్యాలం గంగాధర్, జంగిలి మల్లేష్, సిరిపురం రాజేశం, జంగిలి కరుణాకర్ మరియు మున్నూరు కాపు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గుడిపేటలో రేషన్ దుకాణం సబ్ సెంటర్ ప్రారంభం

జగిత్యాల (వాయిస్ టుడే న్యూస్) : గుడిపేట గ్రామ ప్రజల సౌకర్యార్థం రేషన్ దుకాణం సబ్ సెంటర్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భక్తిని మల్లేశ్వర శ్రీనివాస్ గౌడ్ మరియు సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేతా అంజిరెడ్డి ప్రారంభించారు. గుడిపేట గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో గ్రామ ప్రజలు రేషన్ తీసుకునేందుకు సమీపంలోని మర్యాల గ్రామానికి వెళ్లి ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని స్థానిక సర్పంచ్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జగిత్యాల ఆర్డీవోతో మాట్లాడి గుడిపేటలో రేషన్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ ప్రజల ఎన్నో రోజుల కోరిక నెరవేర్చినందుకు ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేతా అంజిరెడ్డి లకు , గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, రేషన్ కోసం దూర ప్రయాణం అవసరం లేకుండా సబ్ సెంటర్ ఏర్పాటు కావడం ఎంతో ఉపశమనంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

## తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు

### రాజ్యసభ సభ్యులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గాంధీజీ చూపిన అహింసా మార్గంలో 14 సంవత్సరాల పాటు మహోద్యమాన్ని నడిపి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహానేత కేసీఆర్ అని ఎంపీ రవిచంద్ర కొనియాడారు. ప్రజల చిరకాల కోరికను నెరవేర్చడమే కాక తొలి ముఖ్యమంత్రిగా సుపరిపాలన అందించి తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించారని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటల పునరుద్ధరణ జరిగి భూగర్భ జలాల మట్టాలు పెరిగాయని, కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలంగా మారిందని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడంతో పాటు రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని గుర్తు చేశారు. అలాగే దళితబంధు వంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టి సామాజిక వర్గాల సాధికారతకు కృషి చేశారని, ఎస్టీల రిజర్వేషన్లు పెంచిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. భారతరత్న డా. బీ.ఆర్. అంబేడ్కర్‌కు గౌరవ సూచకంగా భారీ విగ్రహం ఏర్పాటు చేయడం, ఆధునిక సచివాలయానికి ఆయన పేరు పెట్టడం గొప్ప నిర్ణయమని అన్నారు. విద్యా రంగంలో గురుకులాల విస్తరణ ద్వారా పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారని, కేసీఆర్ మార్గదర్శకత్వంలో కేటీఆర్ ఐటీ, ఫార్మా రంగాలను అభివృద్ధి పథంలో నడిపించగా, హరీష్ రావు వైద్య సేవలను ప్రజలకు చేరువ చేశారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉన్న ఐటీ ఎగుమతులు 2023--24 నాటికి గణనీయంగా పెరగడం, ఫార్మా రంగం వృద్ధి, తలసరి ఆదాయం పెరుగుదల రాష్ట్ర అభివృద్ధికి ఉదాహరణలని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేళ్ల పాటు అభివృద్ధి దిశగా నడిపించిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొంటూ, ఆయన ఆయురారోగ్యాలతో నిండూ నూరేళ్లు జీవించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆకాంక్షించారు.



## విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి


### టాలివుడ్ సినీ కొరియోగ్రాఫర్ యశ్వంత్

### జోన్ ఏ.జి.యం. నూర్ మహమ్మద్ అలి

హైదరాబాద్,ఫిబ్రవరి 16: వాయిస్ టుడే : వికాసిత్ భారత్ లక్ష్యంతో నిర్వహించిన శ్రీ చైతన్య నారాయణగూడ జోన్ పరిధి లోని బ్రాంచ్ స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు ఉప్పల్ శిల్పారామంలో ఘనంగా జరిగాయి. టాలీవుడ్ ఫిల్మ్ కొరియోగ్రాఫర్ యశ్వంత్ ముఖ్యఅతిథిగా పాల్గొని వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. శ్రీ చైతన్య నారాయణగూడ జోన్ ఏజీఎం నూర్ మహ్మద్ అలీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలని, అప్పుడే జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని అన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని ఆయన అన్నారు. జోన్ ఏజీఎం నూర్ మహ్మద్ అలీ మాట్లాడుతూ విద్యతో పాటు నైతిక విలువలు, వినయాన్ని పెంపొందించే విధంగా విద్యను బోధిస్తున్నామని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను ఇలాంటి కార్యక్రమాల ద్వారా వెలికి తీస్తున్నట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు అన్ని పోటీ పరీక్షలలో మొదటి ర్యాంకులో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల్లో మారుతున్న మనస్తత్వాన్ని మేల్కొల్పేందుకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్‌లు, పతకాలు, సర్టిఫికెట్‌లను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ శివాని పాఠశాల వార్షిక నివేదికను చదివారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా భరితంగా జరిగాయి. విద్యార్థులు విభిన్న కళలను ప్రదర్శించి అందరి ప్రశంసలను అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నారాయణగూడ జోన్ నిర్వహించింది. ఆర్.ఐ. వెంకట్, హిమాయత్ నగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ శివాని, హిమాయత్ నగర్ డీన్ రమేష్, బర్కత్‌పుర బ్రాంచ్ ప్రిన్సిపాల్ ఆకుల మాధవి దేవి, తార్నాక బ్రాంచ్ ప్రిన్సిపాల్ ప్రశాంతి, హబ్సిగూడ -2 ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, నాచారం బ్రాంచ్ ప్రిన్సిపాల్స్ శరణ్ జ్యోతి, వెంకట నర్సయ్య, నల్లకుంట బ్రాంచ్ ప్రిన్సిపాల్ వెంకట రమణ, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీ కీర్తి, మాలతి, షాలిని, జోన్ కో ఆర్డినేటర్లు రాజేంద్ర ప్రసాద్, పుల్లారావు, రవి, సుధ, అన్నపూర్ణ, కిషోర్, నారాయణగూడ జోన్ డీన్లు, ఇంచార్జ్ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లింగోద్భవ పూజలు

హైదరాబాద్,ఫిబ్రవరి 16: వాయిస్ టుడే : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి ఆలయాల్లో లింగోద్భవ పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. లింగోద్భవ మూర్తికి అర్ధరాత్రి ఏకాదశ అభిషేకాలు నిర్వహించారు. కాచిగూడ నెహ్రూనగర్ లోని శ్రీ ఉమా మహేశ్వర దేవాలయంలో భక్తులు లింగోద్భవ వేళ దీపాలు వెలిగించి హారతులు ఇచ్చారు. సర్వేశ్వరుడు మహా లింగాకృతునిగా ఆవిర్భవించిన సమయాన్ని లింగోద్భవంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. కాచిగూడలోని శివాలయాల్లో ఏక రుద్రాభిషేకం, కళ్యాణోత్సవంతో పాటు లింగోద్భవ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివపార్వతులను దర్శించుకున్నారు.తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నేత, జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





## కన్నుల పండువగా...కల్యాణ మహోత్సవం

**-మామిడిపల్లిలో ఘనంగా శివపార్వతుల కల్యాణం**

**-శాశ్వత అన్నదాత కమిటీతో భక్తులకు అన్నదానం**

కోనరావుపేట, ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే): మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శ్రీమహాదేవ శివాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం అత్యంత కన్నులపండువగా నిర్వహించారు. అలయ కమిటీ అధ్వర్యంలో కల్యాణ వేదికను మామిడితోరణాలు, రంగురంగుల పూలతో అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి, విజయ దంపతులు స్వామివారికి తీసుకువచ్చిన పట్టువస్త్రాలతో అర్చకులు తిరునహరి కృష్ణ, లక్ష్మణ్‌లు ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలను అలంకరించారు. అనంతరం స్వామివారి ఎదుర్కొలు ఘట్టాన్ని నిర్వహించి, భక్తుల జేజేధ్వానాల మధ్య మంగళవాయిద్యాలు, మేళాతాళాలు, వేదమంత్రోచ్చరణాలతో ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి తీసుకువెళ్లి ఆశీనులు చేశారు. అలయ కమిటీ సభ్యులు, స్వామివారి వైపు, వేదాపండితులు అమ్మవారి వైపు ఉండి స్వామివారి కల్యాణ తంతును నిర్వహించారు. అనంతరం వేదామంత్రోచ్చరణ, భక్తుల శివనామస్మరణ మధ్య స్వామివారు అమ్మవారి మెడలో మంగళ్యాధారణ చేశారు. ఈ కల్యాణ వేడుకకు గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. భక్తులు వెంట తెచ్చుకున్న కట్నాకానుకలను స్వామివారికి సమర్పించి కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఆలయ కమిటీ, శాశ్వత అన్నదాత ఆలయ కమిటీ సహకారంతో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శాశ్వత దాతలకు ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించి, ప్రసాదాన్ని అందజేశారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ తీపిరెడ్డి మల్లారెడ్డి, శాశ్వత అన్నదాత ఆలయ కమిటీ తీపిరెడ్డి శ్రీనివాస్రెడ్డి, సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి , అర్చకులు బాపురెడ్డి, మాజీ సర్పంచ్‌లు పన్నాల విజయ, కొక్కుల భారత, ఉపసర్పంచ్ కాసర్ల పవిత్ర, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## వేసవి నీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు

**ఉల్లంపల్లిలో మిషన్ భగీరథ పైపులైన్లపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన**

చిగురుమామిడి, ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే): రాబోయే వేసవి కాలంలో తలెత్తే తాగునీటి ఎద్దడిని ముందుగానే నివారించేందుకు ఉల్లంపల్లి గ్రామంలో ప్రత్యేక కార్యాచరణ ప్రారంభమైంది. గ్రామంలో అమలవుతున్న మిషన్ భగీరథ పథకం కింద పైపులైన్ల మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులపై అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్ష చేపట్టారు. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో ఎంపిడిఓ విజయ్ కుమార్, ఎంపిఓ ఖాజామోయినుద్దీన్, ఏఈ జ్ఞానేశ్వరి, గ్రామ కార్యదర్శి జ్యోతి, పంపు డ్రైవర్ వెంకటేశ్వర్లు తదితరులు గ్రామంలోని పలు వార్డులను సందర్శించి నీటి సరఫరా పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. పలు చోట్ల లీకేజీలు, పాత పైపులైన్లు దెబ్బతినడం, తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో వెంటనే మరమ్మత్తు చర్యలు చేపట్టాలని, దెబ్బతిన్న పైపులను తొలగించి కొత్త పైపులను అమర్చాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామానికి నిరంతరంగా, స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ అలువాల శంకర్ మాట్లాడుతూ, "వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. ఎంపిడిఓ విజయ్ కుమార్, ఏఈ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తి చేసి గ్రామంలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల సహకారంతో ఈ వేసవిలో తాగునీటి సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందని అధికారులు స్పష్టం చేశారు.

## సుందరగిరిలో పులి సంచారం వార్త అవాస్తవం

**హైనా అడుగులేనని అటవీ శాఖ స్పష్టం**

చిగురుమామిడి, ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే): సుందరగిరి గ్రామంలో పులి సంచరిస్తోందన్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గ్రామ ప్రజలు, రైతుల్లో ఆందోళన నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని అటవీ శాఖ అధికారులు స్పష్టం చేశారు. చిగురుమామిడి మండలం పరిధిలోని ఈ గ్రామంలో పులి అడుగులు కనిపించాయని ప్రచారం కావడంతో అటవీ శాఖ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ శేఖర్ స్వయంగా గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. రైతుల నుండి వివరాలు సేకరించి, అనుమానాస్పదంగా కనిపించిన అడుగులను పరిశీలించిన అనంతరం అవి పులి అడుగులు కావని, హైనా జాతికి చెందిన అడుగులేనని నిర్ధారించారు.

అధికారుల ప్రకటనతో గ్రామ ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తొలగిపోయాయి. "గ్రామంలో పులి సంచారం లేదు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని సెక్షన్ ఆఫీసర్ స్పష్టం చేశారు. అయితే హైనా సంచారం ఉన్న అవకాశాన్ని నిర్లక్ష్యం చేయరాదని ఆయన సూచించారు. ముఖ్యంగా పశువులను బయట మేతకు వదిలే రైతులు అప్రమత్తంగా ఉండాలని, పశువుల పాకల చుట్టూ బలమైన ఫెన్సింగ్ జాలి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హైనాలు ముఖ్యంగా లేగ దూడలపై దాడి చేసే అవకాశముందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో నిర్ధారణ లేకుండా పులి సంచారం ఉందని ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అనవసర భయం వ్యాపిస్తుందని, ఇలాంటి అవాస్తవాలను ప్రచారం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ హెచ్చరించింది. గ్రామ ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపించిన వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సామాన్యుడికే మేయర్ పట్టం






**కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసిన బీజేపీ నాయకత్వం**

**-- డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు**

**కరీంనగర్ (వాయిస్ టుడే స్పెషల్) :**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి ఈసారి సామాన్య కార్యకర్తకు దక్కడం విశేషంగా నిలిచింది. భారతీయ జనతా పార్టీ పక్షాన మేయర్ అభ్యర్థిగా 2వ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పేరును పార్టీ ఖరారు చేసింది. డిప్యూటీ మేయర్‌గా మాజీ మేయర్ సునీల్ రావు ను ఎంపిక చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఈ మేరకు లేఖపై సంతకం చేశారు. బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి లేఖతో కూడిన కవర్‌ను తీసుకుని కరీంనగర్‌కు చేరుకోగా, నగరంలోని వి. కన్వెన్షన్‌లో బీజేపీ కార్పొరేటర్ల సమావేశం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో జిల్లా ఇంఛార్జీ డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి హైకమాండ్ ఖరారు చేసిన పేర్లను ప్రకటించారు.

ఈ సందర్భంగా 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ప్రతిపాదించగా, 62వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి శ్రీలేఖ బలపర్చారు. డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా సునీల్ రావు పేరును సోమిడి వేణు ప్రసాద్ ప్రతిపాదించగా, భండారి వేణు బలపర్చారు. అనంతరం బీజేపీ కార్పొరేటర్లందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

**హైకమాండ్ వడబోసిన ఎంపిక**

మేయర్ పదవిపై పలువురు బీసీ కార్పొరేటర్లు ఆశలు పెట్టుకున్నప్పటికీ, పార్టీకి చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న గుర్తింపు, కార్యకర్తగా ఎదిగిన ప్రస్థానం వంటి అంశాలను పరిశీలించిన హైకమాండ్ చివరకు ఏబీవీపీ నుండి ప్రారంభమైన రాజకీయ ప్రయాణం కలిగిన కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది.

**షాక్‌లో కొలగాని**

తనను మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేస్తారని ఊహించని కొలగాని శ్రీనివాస్, నిర్ణయం ప్రకటించిన వేళ ఆశ్చర్యంతో పాటు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యకర్తగా కష్టపడితే పదవులు స్వయంగా వస్తాయని, తానే దానికి నిదర్శనమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, జాతీయ నాయకత్వం, రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**ఏబీవీపీ నుండి మేయర్ దాకా...**

1989 జూన్‌లో కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలో జన్మించిన కొలగాని శ్రీనివాస్ ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ చదివారు. చిన్ననాటి నుంచే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని, విద్యార్థి దశలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌లో పని చేశారు. యువ మోర్చా, ఎన్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో పాల్గొని 2010లో ఉత్తమ వలంటీర్ అవార్డును అందుకున్నారు. ఇప్పటి వరకు 15 సార్లు రక్తదానం చేయడంతో పాటు పర్యావరణ, సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు.

రాజకీయంగా 2014--2019 వరకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా, 2020--2025 వరకు కార్పొరేటర్‌గా, కరోనా సమయంలో జిల్లా వ్యాక్సిన్ కన్వీనర్‌గా పనిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 2వ డివిజన్ కార్పొరేటర్‌గా విజయం సాధించారు.

**రామచంద్రరావుకు బండి సంజయ్ ధన్యవాదాలు**

కరీంనగర్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ ఎంపిక పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ సంతోషం వ్యక్తం చేస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావుకు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర నాయకత్వం అందించిన సహకారం కీలకమని పేర్కొన్నారు. కార్యకర్త నుండి మేయర్ దాకా... కొలగాని ప్రస్థానం బీజేపీలో కష్టానికి లభించే గుర్తింపుకు నిదర్శనంగా నిలిచింది.

## కోదాడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం





కోదాడ ,ఫిబ్రవరి 16(వాయిస్ టుడే ప్రతినిధి): స్థానిక ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి సమక్షంలో. కోదాడ మున్సిపల్ చైర్మన్ గా ఎర్నేని కుసుమ వెంకటరత్నం (బాబు) ,అదేవిధంగా మున్సిపల్ వైస్ చైర్మన్ గా దేవరపల్లి మల్లేశ్వరి నాగిరెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన వారిచే ప్రమాణ స్వీకారోత్సవం చేయిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణ. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి పొలంలో పడి యువకుడి మృతి

కోనరావుపేట, ఫిబ్రవరి 16( వాయిస్ టుడే) : మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. బైక్ అదుపుతప్పి పొలంలో పడిపోవడంతో ఓ యువకుడు బురదలో కూరుకుపోయి, శ్వాస ఆడక మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లబోయిన మహేష్ (34) వృత్తిరీత్యా మత్స్యకారుడు. పని నిమిత్తం తన బైక్ పై కోనరావుపేటకు వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ ఒక్కసారిగా అదుపు తప్పింది. వేగంగా వెళ్తున్న బైక్ పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో పొలం బురదతో నిండి ఉండటంతో మహేష్ అందులో కూరుకుపోయాడు. బురద నోరు, ముక్కులోకి వెళ్లడంతో శ్వాస తీసుకోవడం కష్టమై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.



## కేటిఆర్‌ను కలిసిన బి ఆర్ ఎస్ పార్టీ నూతన పాలక వర్గం



జమ్మికుంట ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే): జమ్మికుంట మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కైవసం చేసుకోవడం పట్టణ ప్రజల అభివృద్ధి పట్ల ఉన్న విశ్వాసానికి నిదర్శనం. ప్రమాణస్వీకారం అనంతరం నూతన పాలకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి ఆర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు . హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నేతృత్వంలో నూతన మున్సిపల్ చైర్మన్ మొలుగు దిలీప్ , వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ (జావేద్), కౌన్సిలర్ ఫిరోజ్ ఖాన్ కలిసి కేటీఆర్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జమ్మికుంట పట్టణ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. జమ్మికుంటను రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఆధునిక రహదారులు, మెరుగైన డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, పట్టణ సౌందర్యీకరణ వంటి అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని, జమ్మికుంట పట్టణంలో మరింత వేగంగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రతి వర్గానికీ న్యాయం చేసే విధంగా పాలన అందిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకత్వం మార్గదర్శకత్వంలో జమ్మికుంటలో అభివృద్ధి నూతన దశ ప్రారంభమైందని నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజల మనసు గెలిచిన నాయకుడికి పట్టాభిషేకం

**జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌గా మొలుగు ప్రశాంత్ (దిలీప్) ప్రమాణ స్వీకారం**

**జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కించుకున్న బి ఆర్ ఎస్**

**ఇది ప్రజల గెలుపు**

**- హుజురాబాద్ ఎం ఎల్ ఏ పాడి కౌశిక్ రెడ్డి**





జమ్మికుంట ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే) : మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ మొదలుకొని ఫలితాల వరకు రాయలసీమ రాజకీయాలను తలపించిన జమ్మికుంట మున్సిపల్ పీఠం చిట్ట చివరికి బి ఆర్ ఎస్ కైవసం చేసుకుంది. గత ఐదు సంవత్సరాలుగా బి ఆర్ ఎస్ కార్యకర్తగా జమ్మికుంట ప్రజలకు సుపరిచితుడు, పేరు పేరు నా తమ్మీ, అన్న, అక్క, బాపు, అవ్వ అని ఆప్యాయంగా పలకరించి, ప్రతి పండుగలకు కులమతాలకు అతీతంగా పేద ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందించిన యువ నాయకుడు మొలుగు ప్రశాంత్ అలియాస్ దిలీప్ మున్సిపల్ చైర్మన్ గా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా పై నమ్మకంతో నాకు ఈ బాధ్యతను కట్టబెట్టిన ప్రజలకు ఎల్ల వేళల అందుబాటులో ఉంటూ రేయింబవళ్ళు ఎలాంటి సమస్యలనైనా పరిష్కరిస్తూ మున్సిపల్ అభివృద్ధికి దోహదం చేస్తాను అన్నారు. వైస్ చైర్మన్ గా ముంతాజ్ అలీ మహ్మద్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఎం ఎల్ ఏ పాడి కౌశిక్ రెడ్డి నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్ లకు శుభాకాంక్షలు తెలియజేసారు.

# దళితులను రక్షించేందుకే జాతీయ ఎస్సీ కమిషన్

**రాజేష్ హత్య కేసు పై జాతీయ ఎస్సీ కమిషన్ అధికారులపై ఆగ్రహం...**

**కర్ల రాజేష్ హత్య కేసుపై చార్జ్ షీట్ ఎందుకు వేయలేదు...**

**సీఐతోపాటు వెంటనే ఎస్ఐని సస్పెండ్ చేయాలి...**

**రాజేష్ డెడ్ బాడీ ని రీపోస్టుమార్టం చేయాలి...**

**కమిషన్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోతే ఎస్సీ ఎస్టీ సెక్షన్ 4 ప్రకారం అధికారులు అందరికీ చర్యలు తప్పవు......**

**రాజేష్ తల్లికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలి...**

**జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ స్పష్టం....**



కోదాడ ,ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే ప్రతినిధి.). దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ స్పష్టం చేశారు. సోమవారం కోదాడ పట్టణంలో ఇటీవల పోలీసు లాక్ అప్ డెత్ కు గురైన కర్ల రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లి లలితమ్మతో రాజేష్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ నుండి మంజూరైన పెన్షన్ పత్రాన్ని జిల్లా కలెక్టర్ నందలాల్ పవర్,అడిషనల్ డీజీ చౌహన్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సమక్షంలో అందజేశారు. అనంతరం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఉన్నత స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కేసు వివరాలను అధికారులతో దర్యాప్తు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కర్ల రాజేష్ కేసు పత్రికల్లో చూసి ఎస్సీ కమిషన్ సుమోటో కింద కేసు నమోదు చేసిందన్నారు. కమిషన్ కేసులో ప్రవేశించిన అనంతరం ఎఫ్ఐఆర్ చేశారని అంతకుముందు జరగలేదన్నారు. రాజేష్ మృతి పై నేటి వరకు ఛార్జ్ షీట్ ఎందుకు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులో బాధ్యులైన సిఐని సస్పెండ్ చేయడమే కాదు ఎస్సైని వారం రోజుల్లో సస్పెండ్ చేయాలని అడిషనల్ డీజీ,జిల్లా ఎస్పీని ఆదేశించారు. పది రోజుల్లో రీ పోస్టుమార్టం చేసి నివేదికను అందించాలని ఆదేశించారు. జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సెక్షన్ 4 ప్రకారం కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు జవాబు ఇవ్వకపోతే నిర్లక్ష్యపు చట్టం ప్రకారం సస్పెన్షన్ తో పాటు ఆరు నెలలు జైలు ఉంటుందని హెచ్చరించారు. రాజేష్ తల్లికి మూడు రోజుల్లో ఉద్యోగం, పెన్షన్, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, మూడు ఎకరాల భూమి ఆరు నెలల్లో ఇచ్చేందుకు కలెక్టర్ అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట అడిషనల్ డీజీ చౌహన్, కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ పవర్, ఎస్పీ నరసింహ,ఆర్డీవో సూర్యనారాయణ, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ,ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ 34 వ వార్డు కౌన్సిలర్ గంధం బాలేంద్ర, పాండు,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వంగవీటి శ్రీను,ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇన్చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు,ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు యలమర్తి రాము, కొండపల్లి ఆంజనేయులు, వడ్డేపల్లి కోటేష్, యాతాకుల రాజన్న, కుడుముల శ్రీను, ఏపూరి సత్యరాజు,పిడమర్తి వెంకట్రావు , బిజెపి నుండి నూనె సులోచన, బొలిశెట్టి కృష్ణయ్య, అంజి యాదవ్, బచ్చలకూరి ప్రసాద్, చింత్రాల బాలచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



## యువతలో ఉత్సాహాన్ని రగిలిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా ఫిబ్రవరి-16 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పెద్దపల్లి జిల్లా స్థాయిలో కబడ్డీ,ఖో ఖో, వాలీబాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి జిల్లా డీవైఎస్ఓ అక్కపాక సురేష్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, పేట రాష్ట్ర బాధ్యులు శోభారాణి, జిల్లా పేట అధ్యక్ష కార్యదర్శులు సురేందర్, దాసరి రమేష్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు విద్యార్థులు, యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు నిర్వహించబడుతున్నాయనీ ఈ పోటీల ద్వారా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయడం లక్ష్యంగా సాగుతున్నాయని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని యువతను ప్రోత్సహించడమే సీఎం కప్ ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు.క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఇలాంటి పోటీలు భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒలంపిక్ ఈసీ మెంబర్ సిలివేరి మహేందర్, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కర్ణాకర్,మండల ఎస్ జి ఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీవాణి, సరోజ, స్వరూప,సంధ్య,వెంకటేష్, విష్ణు, జావిద్, మాధవి, వెంకటేష్, అజయ్, కుమార్,రాజేందర్,ఇక్బాల్, అజ్జు, గెల్లు మధుకర్,సత్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్



నర్సాపూర్ (వాయిస్ టుడే) : నర్సాపూర్ పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నాడు ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మన్ వనమూల బుచ్చిష్ యాదవ్ మాట్లాడుతూ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఎమ్మెల్సీ అంజిరెడ్డి సహకారంతో నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధిచేస్తానని ఆయన తెలిపారు నాకు 13వార్డు ప్రజలు నన్ను ఆదరించి గెలిపించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారుఅదేవిధంగా నర్సాపూర్ పట్టణ ప్రజలు సహకరించి నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు నర్సాపూర్ పట్టణ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండి తన వంతు నిస్వార్థ సేవలు అందిస్తా అన్నారు. నన్ను ఆదరించి గెలిపించిన ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉప ముఖ్యమంత్రి చొరవతో వెన్నుముక ఆపరేషన్‌కు రూ. 2.50 లక్షల ఎల్.ఓ.సి మంజూరు

**ముదిగొండ మండలం వనంవారి కృష్ణాపురం గ్రామానికి చెందిన రొడ్డ వెంకన్నకు లబ్ధి**

**ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిన భరోసా**

**జిల్లా కాంగ్రెస్ నాయకులు మల్లెల అజయ్ కృషితో సాకారం**



ముదిగొండ ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే) : పేద ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని నిరూపిస్తూ, ముదిగొండ మండలం వనంవారి కృష్ణాపురం గ్రామానికి చెందిన రొడ్డ వెంకన్నకు భారీ ఆర్థిక సాయం అందింది. గత కొంతకాలంగా వెన్నుముక సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వెంకన్నకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు రూ. 2,50,000 (రెండు లక్షల యాభై వేల రూపాయల) విలువైన ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ని మంజూరు చేశారు.

# హుజూరాబాద్ మున్సిపల్ పీఠంపై ఎగిరిన కాంగ్రెస్ జెండా..

**- దశాబ్దాల తర్వాత హుజురాబాద్‌లో హస్త వికాసం..**

**- ఈ విజయంతో కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహం..**

**- చైర్మెన్‌గా సుహాసిని, వైస్ చైర్మన్‌గా అంజలి ఎన్నిక..**

**- అభ్యర్థుల ఎంపిక నుండి ప్రచారం వరకు తనదైన శైలిలో ముద్ర వేసిన ప్రణవ్.**

**- అటు అధిష్టానం నుండి వచ్చిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తో పాటు స్థానికంగా ఉన్న వారిని సమన్వయం చేయడంలో సక్సెస్..**

**- హుజురాబాద్‌లో చరిత్ర తిరగరాసిన కాంగ్రెస్**

**- భవిష్యత్ లో ఏ ఎన్నికైన హుజురాబాద్ మున్సిపల్ తీర్పే అంతటా వస్తుంది.**



హుజురాబాద్ ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే): హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా ఎగరవేసింది. కొన్ని దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ పార్టీకి విజయ తిలకాన్ని దిద్దారు హుజరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి అభ్యర్థుల ఎంపికలో ఆచుతూచి వ్యవహరిస్తూ,ఈసారి ఎలాగైనా హుజురాబాద్ లో జెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉండి విజయయాత్రను కొనసాగించారు. సోమవారం నాడు హుజూరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ప్రమాణస్వీకారం చేసిన అనంతరం చైర్మెన్ గా రోంటాల సుహాసిని,వైస్ చైర్మన్ గా గూడూరి అంజలి ఎన్నికున్నారు. అనంతరం జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,ప్రణవ్ ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గెలిచిన సభ్యులను ఘనంగా సన్మానించారు ఎమ్మెల్యే నవీన్ యాదవ్,ప్రణవ్. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు దగ్గరై ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసిందని,ఇకపై హుజురాబాద్ లో ఏ ఎన్నిక జరిగినా ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని వారు అన్నారు. గెలిచిన కౌన్సిలర్లు ప్రజల సేవలో ఉంటారని ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు మరింత చేరువ చేస్తామని,సంక్షేమం,అభివృద్ధి మా ప్రధాన ధ్యేయమని అప్పుడు ఎన్నికల్లో చెప్పినట్టు నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ,బీఆర్ఎస్ ఒక్కటైనా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆపలేకపోయారని,ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సొంతంగానే జెండా ఎగరవేసినట్టు,వచ్చే ఎంపిటిసి,జడ్పీటీసీ ఎన్నికల్లో ఇదే విజయం పునరావృతం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఇంతటి మెజారిటీ అందించిన హుజూరాబాద్ ప్రజలకు అటు జమ్మికుంట ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు నవీన్ యాదవ్,ప్రణవ్. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ కాంగ్రెస్ శ్రేణులు భారీగా హాజరయ్యారు.



## న్యాయవాది హత్యకు నిరసనగా ధర్నా

**- విధులు బహిష్కరించిన న్యాయవాదులు**

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా ఫిబ్రవరి-16 వాయిస్ టుడే: రంగారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యుడు అత్తాపూర్‌కు చెందిన న్యాయవాది మొహమ్మద్ ఖదీర్ అడ్వకేట్‌ను దుండగులు అతి దారుణంగా హత్య చేయడాన్ని సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించారు. హత్యకు నిరసనగా సోమవారం స్థానిక కోర్టు న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులను బహిష్కరించారు. అనంతరం కోర్టు ఎదుట న్యాయవాదులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై దాడులు ఎక్కువయ్యాయని, న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. చట్టం తీసుకువచ్చేలా రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణ మొదలు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, న్యాయవాదులు పడాల శ్రీరాములు, జోగుల రమేష్, పడాల అంజయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, ఆవుల శివకృష్ణ, రుద్రారపు నర్సయ్య, చీకటి సంతోష్, దాసరి సత్యనారాయణ, చిలుక ఆనంద్, అంబాల నర్సయ్య, గుడ్ల వెంకటేష్ , వేముల స్నేహ, మదూరి పృథ్వీ, రుద్రారపు శ్యాం సుందర్ , ఆరేపల్లి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.




## ఏరియాలో ట్రైపార్టైట్ ప్రయాస్ మీటింగ్

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 16: సోమవారంన కొత్తగూడెం ఏరియాలోని ఉద్యోగుల పెన్షన్ పిఎఫ్ సమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెం ఏరియా జిఎం అధ్యక్షతన సీఎంపిఎఫ్ వారి ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ హాల్ నందు పెన్షన్ పీఎఫ్ క్లెయిమ్ లను తప్పులు లేకుండా దాఖలు చేసే విధానం పైన ట్రైపార్టైట్ ప్రయాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు ముందుగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం శాలెంరాజు రీజినల్ కమిషనర్ సీఎంపిఎఫ్ కే. వంశీధర్ ని ఏం కనకమ్మ ని పుష్పగుచ్చంతో స్వాగతం పలికినారు. ఈ సందర్భంగా కమిషనర్ సీఎంపిఎఫ్ మాట్లాడుతూ పెన్షన్ పీఎఫ్ క్లెయిమ్ చేసునపుడు తప్పులు లేకుండా ఆన్లైన్ లో దాఖలు చేయటం వలన కలిగే ప్రయోజనాలను మరియు క్లెయిమ్ రిటర్న్ చేయడం వలన జరిగే జాప్యాన్ని తగ్గించుకోవచ్చని ఉద్యోగుల పీఎఫ్ మరియు పెన్షన్ ని త్వరితగతిన సెటిల్ చేయవచ్చని అధికారులకు సిబ్బందికి తెలియజేశారు .

అలాగే కొత్తగూడెం ఏరియాలో పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు సీఎంపిఎఫ్ క్లెయిమ్ సెటిల్మెంట్ చేసే సంబంధిత సిబ్బందితో ప్రాయాస్ కార్యక్రమం ద్వారా సి-కేర్ పోర్టల్ లో క్లైమ్ సెటిల్మెంట్ కు సంబంధించి వివిధ విషయాలను క్షుణ్ణంగా చర్చించి సీఎంపిఎఫ్ క్లెయిమ్స్ సెటిల్మెంట్ కొరకు సి-కేర్ పోర్టల్ లో దాఖలు చేస్తున్నప్పుడు ఉత్పన్నమవుతున్న సమస్యలను ఈ కార్యక్రమంలో వివరించి సరిచేసుకునే విధానాలను తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఎంపిఎఫ్ కమిషనర్స్ మాట్లాడుతూ ప్రాయాస్ మీటింగ్ రెగ్యులర్ గా సింగరేణి పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు సంబంధిత సిబ్బందితో క్లెయిమ్స్ సెటిల్మెంట్ లను త్వరితగతిన పూర్తిచేయడం కొరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు అలాగే సీఎంపిఎఫ్ క్లెయిమ్ త్వరితగతిన సీ-కేర్ పోర్టల్ ద్వారా జీరో పెండెన్సీ తో సిఎంపీఎఫ్ క్లెయిమ్స్ ను సెటిల్మెంట్ చేస్తున్న కొత్తగూడెం ఏరియా మేనేజ్మెంట్ ను అభినందించారు. సీ-కేర్ పోర్టల్ ద్వారా ఈ యొక్క కార్యక్రమానికి హాజరైన మాజీ ఉద్యోగుల అప్లికేషన్లను తీసుకొని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలియజేయడం జరిగింది, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తామని మాజీ ఉద్యోగులు హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జిఎం జి. వి కోటి రెడ్డి గారితో పాటు సీఎంపీఎఫ్ కమిషనర్స్ కే. వంశీధర్, ఎం.కనకమ్మ, అసిస్టెంట్ కమిషనర్ పి. చిరంజీవి, కొత్తగూడెం ఏరియా ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ కే. రాములు, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఎజిఎం (సివిల్) సిహెచ్ రామకృష్ణ, ఎజిఎం( ఫైనాన్స్) ఈ.భీబస్తా, ఎజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, ఏరియా రక్షణాధికారి వెంకటేశ్వరరావు, సీనియర్ పిఓ ఎం. మురళి, ఆర్.సి.హెచ్.పి ఇంచార్జ్ అజ్మీరా శ్రీనివాస్, కొత్తగూడెం ఏరియాలోని మైన్స్ అండ్ డిపార్ట్మెంట్ లోని సంబంధిత పెన్షన్ సెటిల్మెంట్ సిబ్బంది మాజీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం



చేవెళ్ల... ఫిబ్రవరి 16(వాయిస్ టుడే)శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ గా 15వ వార్డు నుంచి గెలిచిన సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ గా 14వ వార్డు నుంచి గెలిచిన శ్వేతా పాండురంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చేవెళ్ల ఇంచార్జ్ ఆర్డిఓ వెంకట్ రెడ్డి మున్సిపల్ కార్యాలయ సమావేశంలో 15 మంది కౌన్సిలర్ ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఒకటవ వార్డు నుండి ఎర్రోళ్ల ఆనంద్ రావు, రెండవ వార్డు నుంచి రెండోసారి గెలిచిన బిసోళ్ల సంధ్యారాణి అశోక్ కుమార్, మూడవ వార్డు నుంచి గుండ గిరిజ చంద్రశేఖర్, నాలుగవ వార్డు నుంచి మణికొండ లలితా మోహన్ రెడ్డి, ఐదవ వార్డు నుంచి బానూరు కృష్ణ, ఆరవ వార్డు నుండి ఉష కిరణ్ విజయ్ కుమార్, ఏడవ వార్డు నుంచి బండ్లగూడెం ప్రశాంత్, ఎనిమిదవ వార్డు నుంచి పీచరి అఖిల యాదవ రెడ్డి, తొమ్మిదవ వార్డు నుంచి వాకిటోళ్ళ గణేష్, పదవ వార్డు నుంచి రాజండ్ల వసంత మహేందర్ రెడ్డి, 11వ వార్డు నుంచి ఫైముదా బేగం, 12వ వార్డు నుంచి దండు రాజేశ్వర్, 13వ వార్డు నుంచి చాకలి అశోక్ లు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు మాట్లాడుతూ మాపై నమ్మకంతో గెలిపించిన వార్డు ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, పెండింగ్ పనులను వైస్ చైర్మన్, కౌన్సిలర్ల సహకారంతో పరిష్కరిస్తానని నూతన చైర్మన్ ప్రవీణ్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, నూతన చైర్మన్, వైస్ చైర్మన్ లను శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
మంగళవారం 17 ఫిబ్రవరి 2026

## సాధుల నగర్ గ్రామంలో ఘనంగా శ్రీ మల్లన్న జాతర ఉత్సవాలు బండ్లు బోనాలు అగ్గి గుండాలు ఊరేగింపు



నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండల పరిధిలోని సాదుల నగర్ గ్రామంలో సోమవారం నాడు శ్రీ మల్లికార్జున స్వామి జాతర అగ్గి గుండాలు బండ్లు బోనాలు ఒగ్గు కథ ఘనంగా నిర్వహించారు ఈ జాతర ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుండి భారీగా జాతర ఉత్సవాలలో పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ అన్నదాన కార్యక్రమానికి అన్నదాత బ్రాహ్మణగూడ సర్పంచ్ శోభ లింగం గౌడ్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా బ్రాహ్మణ గూడ సర్పంచ్ శోభలింగం గౌడ్ మాట్లాడుతూ మల్లన్న స్వామి హత్నూర మండల ప్రజలను సుకో సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని వారు ఆ స్వామి వారిని వేడుకున్నారు ఈ అన్నదాన కార్యక్రమంలో సాధుల్ నగర్ గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటిని కలిసిన జిల్లా గౌడ ప్రముఖులు



ఖమ్మం జిల్లా ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే ) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఐదు కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నట్లు జీవో జారీ చేసిన సందర్భంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వారి క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమాలతో శాలువాతో సత్కరించి ధన్యవాదములు తెలిపిన జిల్లా గౌడ ప్రముఖులు పొంగులేటి ని కలిసిన వారిలో వట్టికూటి సైదులు గౌడ్, డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్, డాక్టర్ కె శ్రీధర్ గౌడ్,సర్కిల్ ఇన్స్పెక్టర్ బంధం ఉపేందర్ గౌడ్, బాలుబోయిన వెంకటేశ్వర్లు గౌడ్, కిరణ్ గౌడ్, నరసింహారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నర్సాపూర్ మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవాసం

### మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్

నర్సాపూర్ (వాయిస్ టుడే) : నర్సాపూర్ మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న నేపథ్యంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవులరాజి రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి గార్లు భారీ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ మీూూ గారి తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ గారు పాల్గొనారు. నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ గా ఎన్నికైన మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ గారిని మరియు కౌన్సిలర్లకు ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీ పీఠాన్ని గెలుచుకున్నామని, ఇది పార్టీ శ్రేణుల కృషి, కార్యకర్తల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని, నర్సాపూర్ పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడతామని తెలిపారు.. పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. పేద, బలహీన వర్గాల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక, ప్రజాకేంద్రిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ కార్యకర్తలకు నేను భరోసా

### యువనేత నల్లమోతు సిద్ధార్థ బాధితుల నివాసాలకు వెళ్లి పరామర్శ

మిర్యాలగూడ ఫిబ్రవరి16(వాయిస్ టుడే) : మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడి, ఇటీవల ఆసుపత్రి నుండి కోలుకుని ఇంటికి చేరుకున్న బిఆర్ఎస్ కార్యకర్తలను యువనేత నల్లమోతు సిద్ధార్థ పరామర్శించారు. మిర్యాలగూడ పట్టణ 29వ వార్డు బంగారుగడ్డలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గూండాలు జరిపిన దాడిలో బిఆర్ఎస్ కార్యకర్తలు జమీర్, మస్తాన్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. వీరు గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇప్పుడిప్పుడే కోలుకుంటూ ఇంటికి చేరుకున్నారు. బాధితుల నివాసాలకు స్వయంగా వెళ్లిన నల్లమోతు సిద్ధార్థ, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మరియు వారి కుటుంబ సభ్యులకు కొండంత ధైర్యాన్ని నింపుతూ, పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ ఏకగ్రీవ ఎన్నిక

## మేయర్‌గా మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్‌గా సిరిపురప్పు లలితా కుమారి





భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 16: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. మున్సిపల్ సాధారణ ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల కార్యక్రమం నియమావళి ప్రకారం నిర్వహించబడింది. సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధ్యక్షత వహించి,ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మొత్తం 60 డివిజన్లకు గాను ఎన్నికైన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సీపీఐ పార్టీకి చెందిన 22 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది, బీజేపీకి చెందిన 1 మంది, సీపీఎం పార్టీకి చెందిన 1 మంది, స్వతంత్రంగా గెలుపొందిన 6 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు.

అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది. 20వ డివిజన్‌కు చెందిన సీపీఐ కార్పొరేటర్ మూడ్ గణేష్ మేయర్‌గా, 8వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ కార్పొరేటర్ సిరిపురపు లలితా కుమారి డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎక్స్-అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరైన స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో సమాన అభివృద్ధి సాధించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పట్టణంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పారదర్శక, బాధ్యతాయుత పాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎక్స్-అఫీషియో సభ్యులు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్పొరేషన్ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమోయ్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఐడీఓసి కార్యాలయం నుండి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించ బడినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అతి చిన్న వయస్సులో కౌన్సిలర్



మిర్యాలగూడ ఫిబ్రవరి 16(వాయిస్ టుడే): మిర్యాలగూడ మున్సిపాలిటిలో అతి చిన్న వయస్సులో కౌన్సిలర్ ఎన్నికైయ్యాడు. ఉన్నత చదువులు చదవాల్సిన విద్యార్థి ప్రజా సేవకై మొగ్గు చూపాడు. తన తండ్రి ప్రజలకు సేవ చేస్తూ మన్న నలు పొందుతున్న తీరుకు ఆకర్షితుడై మొదటి ప్రయత్నంలోనే వార్డు కౌన్సిలర్ గా గెలుపొంది ఆదర్శంగా నిలుస్తున్నాడు. వివరాల ప్రకారం మిర్యాలగూడ లోని 26 వార్డు బీసీ జనరల్ రిజర్వేషన్ కావడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి పొదిల నిక్షిత్(22) నామినేషన్లు వేశాడు. కానీ ఆఖరి నిమిషంలో బీ ఫామ్ రాకపోవడంతో తన తండ్రి పోదిల వెంకన్న సూచనతో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి నాగరాజుపై గెలుపోందాడు. 22 ఏళ్ల నిక్షిత్ డిగ్రీ పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రజా సేవ చేయాలనే అలోచన మా నాన్న వలన వచ్చింది. చిన్న వయస్సు అయినప్పటికి కౌన్సిలర్ ఎన్నికున్న ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తాన న్నారు. ఇదిలా ఉండగా పొదిల వెంకన్న 40 వార్డులో పోటీ చేసి స్వల్ప ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓడిపోయాడు.

## రాయికల్ పురపాలక సంఘం చైర్మన్‌గా కట్కం రవీందర్



రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ మున్సిపాలిటీలో చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందో అనే ఉత్కంట కు సోమవారం తెర పడింది. రాయికల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ మరియు ఇండిపెండెంట్ కౌన్సిలర్ల మద్దతు తో బి ఆర్ ఎస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. దీనిలో చైర్ పర్సన్ కట్కం రవీందర్ మరియు వైస్ చైర్ పర్సన్ గా తురగ సౌజన్య - శ్రీధర్ లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రవీందర్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను చైర్ పర్సన్ చేసినందుకు మన రాయికల్ ను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ప్రత్యేక మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని. నేను సేవ చేయడానికి రాజకీయంలోకి వచ్చాను కానీ ఇందులో ఎలాంటి ఉద్దేశం లేదని అన్నారు. అందరి సహాయ సహకారాలు నాకు ఎల్లవేళలా ఉండాలని కోరాడు. ఐదు సంవత్సరాలు రాయికల్ ను అభివృద్ధి పథంలో నడిపించడానికి నా శక్తి ఉన్నంతవరకు కృషి చేస్తానని తెలిపారు. వైస్ చైర్మన్ తురగ సౌజన్య మాట్లాడుతూ.. 12 కౌన్సిలర్లలో నేను నాలుగో వార్డ్ కౌన్సిలర్ అని అందులో నాకు 702 ఓట్లు వచ్చాయని నాకు భారీ మెజారిటీ వచ్చిందని నా భర్త అయిన తురగ శ్రీధర్ గత ఐదు సంవత్సరాలు నా వార్డు ప్రజలకు చేసిన సేవ మరియు వార్డు అభివృద్ధియే ఈ మెజారిటీకి కారణమని అన్నారు. మాపై నమ్మకం ఉంచి వైస్ చైర్ పర్సన్ గా నియమించినందుకు చైర్మన్ మరియు కౌన్సిలర్లతో కలిసి రాయికల్ మున్సిపాలిటీని అభివృద్ధి లో నడిపించడంలో నా వంతు కృషి చేస్తానని తెలిపారు.



## నందికొండ మున్సిపల్ చైర్మన్ మానస స్వర్ణ, వైస్ చైర్మన్‌గా రాజాప్రసాద్ ప్రమాణ స్వీకారం

### మున్సిపల్ కార్యాలయంలో అట్టహాసంగా పాలకవర్గ ప్రమాణస్వీకారం

### నూతన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



నాగార్జునసాగర్ ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే) : నందికొండ మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం కొలువుదీరింది జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయం లో సోమవారం నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కమిషనర్ అశోక్ రెడ్డి ఘనంగా ఏర్పాటు చేశారు,జిల్లా ప్రత్యేక అధికారి టి, విజయేందర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై,నూతన కౌన్సిలర్లచే ప్రమాణ స్వీకారం చేయించారు,ముందుగా మున్సిపాలిటీలోని 12 మంది కౌన్సిలర్లు పదవీ బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు,అనంతరం చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా 12వ వార్డు కౌన్సిలర్ మానస స్వర్ణ పేరును చైర్మన్ గా ప్రతిపాదించారు. ఆ తరువాత వైస్ చైర్మన్‌గా గొడవర్తి రాజాప్రసాద్ పేరును ప్రతిపాదించగా మెజారిటీ సభ్యులు మద్దతు తెలపడంతో వీరిద్దరి ఎన్నిక ఖరారైంది,ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్,వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు విజయ విహార్ అతిథి గృహంలో నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీగా ఉంటూ,నందికొండ అభివృద్ధికి కౌన్సిలర్లు ప్రత్యేక కృషి చేయాలి, ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కౌన్సిలర్లు పని చేయాలని సూచించారు,నందికొండ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుంది వార్డుల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు,ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోషణ అభియాన్ అద్భుత పథకం

### రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి

### కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగనవాడి అధికారులతో సమీక్ష సమావేశం



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 16: స్థానిక సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నందుగల సమావేశ మందిరంలో మహిళా, శిశు, వయోవృద్ధులు వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారిని జె. స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ప్రతి ఒక్క అంగనవాడి కేంద్రం తెరవాలని, తెరిచిన వెంటనే టీచర్, హెల్పర్, లబ్ధిదారుల హాజరు కేంద్ర రాష్ట్ర స్థాయి అప్లికేషన్లు అయినటువంటి పోషణ ట్రాకర్ న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టంలో నమోదు చేయాలని తెలిపారు. వైద్యశాఖ సమన్వయంతో అతి తీవ్ర పోషణ లోపం, పోషణ లోపం, తక్కువ బరువుతో ఉన్న పిల్లలను ప్రత్యేకంగా పర్యవేక్షించి వైద్యుల సూచనల మేరకు న్యూట్రిషన్ రీహబిటేషన్ సెంటర్కి పంపించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతినెల క్రమం తప్పకుండా అత్యాధునిక సాంకేతిక పరికారాలతో పిల్లల ఎత్తు, బరువులు చూసి సరైన సమయంలో సరైన పోషణ అందించాలని కోరారు. కిశోర బాలికల కోసం రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు క్రింద "ఇందిరమ్మ అమృతం" పేరుతో 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల ఆడపిల్లలకు మిల్లెట్స్ తో కూడిన చిక్కిలు నెల నెల అందజేయడం జరుగుతుందని తద్వారా రక్తహీనత లోపం లేకుండా ఆరోగ్యవంతులుగా ఉండడమే మన లక్ష్యం అన్నారు, నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి పౌష్టికాహార పంపిణీలో జాప్యం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఎవరైనా గుత్తేదారులు పంపిణీ విషయంలో కానీ నాణ్యత విషయంలో గానీ అలసత్వం ప్రదర్శిస్తే బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. ప్రతినెల షెడ్యూల్ ప్రకారం అంగనవాడి పర్యవేక్షకురాలు (సూపర్వైజర్) తమ సెక్టార్ యొక్క అంగన్వాడీ కేంద్రాల సందర్శించి రాష్ట్ర పోర్టల్ ఎం ఎం అంగనవాడిలో వివరాలను నింపాలని, పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహార విలువలపై టీచర్లకు అవగాహన కల్పిస్తూ, పోషణ అభియాన్ పథకంలో భాగంగా తల్లుల కమిటీ, గ్రామస్తులు, గ్రామ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సామూహిక వేడుకలు అయినటువంటి అక్షరాభ్యాసం, అన్నప్రాసన, శ్రీమంతాలు నిర్వహిస్తూ వారిలో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్రంలోని ఎక్కడ లేని విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ తనదైన శైలిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శాశ్వతంగా అంగన్వాడీ కేంద్రాలకు ఇచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు గాను పెరటి తోట పెంపకాలు (న్యూట్రి గార్డెన్స్) నిర్మించారని దీనిని ఆదర్శంగా తీసుకొని వివిధ జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని జే. స్వర్ణలత లెనీనా, జిల్లా సిడిపివోలు ప్రసన్న లక్ష్మి, జయలక్ష్మి, తార, అరుణ కుమారి, పద్మశ్రీ, చైతన్య, సలోమి, హేమ సత్య, జ్యోతి, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ పొనుగోటి సంపత్, జిల్లా కార్యాలయ సిబ్బంది హసీనా, భార్గవి, డి. సి .పి .ఓ హరికుమారి, చైల్డ్ లైన్ సందీప్, జిల్లా పోషణ అభియాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ కాంగ్రెస్ కైవసం

**మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ల ఎన్నిక..**

**మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీ**

**చైర్మన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్లకు సత్కారం**

**కృతజ్ఞతలు,అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే నాగరాజు**



హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: వర్ధన్నపేట మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం వర్ధన్నపేటలో భారీ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో చైర్మన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్లు,పార్టీ శ్రేణులు,కార్యకర్తలు,అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అంతటా కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగురవేస్తూ నినాదాలతో పట్టణం మార్మోగింది. ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీ పీఠాన్ని గెలుచుకున్నామని..ఇది పార్టీ శ్రేణుల కృషి,కార్యకర్తల త్యాగాల ఫలితమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని,వర్ధన్నపేట పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడతామని తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ లోని 6వార్డుల్లో ఘనవిజయం సాధించి ప్రమాణస్వీకారం చేపట్టిన కౌన్సిలర్లకు ఎమ్మెల్యే నాగరాజు శుభాకాంక్షలు,అభినందనలు తెలియజేశారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా పార్టీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు, పట్టణ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన ప్రతి ఓటరికి ఆయన ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ పాలకుర్తి సారంగపాణి,వైస్ చైర్మన్ ఎన్నికైన నేతావాత్ శీభారాణిలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. కొంతమంది వ్యక్తులు వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడి అసత్య ప్రచారాలు నిర్వహించినా ప్రజలు వాటిని తిరస్కరించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. అధికారదుర్వినియోగం చేశామనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని.. తాము ఎప్పుడూ రాజ్యాంగబద్ధంగా,ప్రజాస్వామ్య పద్ధతిలోనే పనిచేస్తామని స్పష్టం చేశారు. పేద,బలహీన వర్గాల సంక్షేమం,మౌలిక వసతుల అభివృద్ధి,పారదర్శక పాలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. వర్ధన్నపేట కాంగ్రెస్ గెలుపులో కీలక పాత్ర పోషించిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి,వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయూబ్ లకు అలాగే మండలాధ్యక్షులు,పట్టణ నాయకులు, యువజన,మహిళా విభాగాల ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వర్ధన్నపేట పట్టణ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అహర్నిశలు శ్రమించి వర్ధన్నపేటను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక ప్రజాకేంద్రిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు.



## బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక

**కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాది**

**వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని**

కాజీపేట, వాయిస్ టుడే: పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట పట్టణానికి చెందిన చిరువ్యాపారులు కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీ నుండి భారీ సంఖ్యలో కాజీపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గుంటి కుమారస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరినవారిని ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కండువా ఒంటి మీద ఉండడం ఒక గౌరవప్రదం అని అ గౌరవాన్ని అలాగే కాపాడాలని కోరారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తనదేనని అన్నారు. ప్రతి నిమిషం అందుబాటులో ఉంటానని ఎవరికి ఏ సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అబూబకర్ మరియు రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సర్వర్,షేక్ గులాం రసూల్,యూసుఫ్,రాజు,విఘ్నేశ్,రవి తో పాటుగా సుమారు 40 మంది నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.




## పరకాల మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం

**మున్సిపల్ ఛైర్మన్ గా సునీల్ కుమార్, వైస్ ఛైర్ పర్సన్‌గా దివ్య**

హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: పరకాల మున్సిపల్ కార్యాలయంలోని సమావేశపు హాలులో నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్ ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంఖా కౌన్సిలర్ల చేత పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్లను మున్సిపల్ కమిషనర్ అంజయ్య,అధికారులు,సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కౌన్సిలర్ లకు ధ్రువపత్రాలను అధికారులు అందజేశారు. ముందుగా నూతన కౌన్సిలర్ ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగగా పురపాలక ఛైర్మన్,వైస్ ఛైర్మన్ ల ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. చైర్మన్,వైస్ చైర్మన్ ల ఎన్నికకు కౌన్సిలర్ల నుండి ప్రతిపాదనలు అధికారులు ఆహ్వానించారు. ముందుగా ఛైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్ ను కౌన్సిలర్ లు ప్రతిపాదించి బలపరిచారు. అదేవిధంగా వైస్ చైర్ పర్సన్ గా ఏకు దివ్య ను ఎన్నుకున్నారు. చైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్,వైస్ చైర్ పర్సన్ గా ఏకు దివ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి,ఎంపీడీవో రవీందర్,టిపిఓ సుష్మ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కోహీర్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

**కోహిర్. చైర్మన్ చైర్మన్.ఎం. అశోక్,**

**వైస్ చైర్మన్‌గా అబ్దుల్ హన్నన్ జావిద్ ఎన్నిక**






వాయిస్ టుడే ఝరాసంగం : జహీరాబాద్ అర్బన్ (కోహీర్): కోహీర్ మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మేజర్ గ్రామపంచాయతీ నుంచి కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలో తొలిసారి అధికార కాంగ్రెస్ పుర పీఠాన్ని దక్కించుకుంది. మున్సిపల్ చైర్మన్‌గా ఎం. అశోక్, వైస్ చైర్మన్‌గా అబ్దుల్ హన్నన్ జావిద్ ఎంపికయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్‌తో ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ నెల 13న జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్-8, బీఆర్ఎస్-5, ఎంఐఎం, ఇండిపెండెంట్ ఒక్కొక్కరుగా విజయం సాధించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి 8 మంది కౌన్సిలర్లు సహా ఎంఐఎం, ఇండిపెండెంట్ కౌన్సిలర్ల మద్దతు పలికారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పూర్తి కావడంతో కాంగ్రెస్ మద్దతుదారులు మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో సంబరాలు నిర్వహించుకున్నారు.

## వేయి స్తంభాల దేవాలయంలో ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

**పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



వరంగల్ ( వాయిస్ టుడే ) ఫిబ్రవరి 16 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏవివి, వాగ్దేవి ఇంజనీరింగ్ అలాగే కేయూ బయోటెక్నాలజీ కాలేజీలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సుమారు 90 మంది మూడు షిఫ్టులలో వేయి స్తంభాల గుడి దేవాలయంలో ఉదయం 5 గంటల నుండి సోమవారం ఉదయం ఐదు గంటల వరకు 24 గంటలు భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా తమ సేవలు అందించారు. ముఖ్యంగా క్యూలైన్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎండాకాలం దృష్టా భక్తుల కు 5000 వేల చల్లని బాటిల్స్ భక్తులకు అందించడం తో పాటు మరియు చిన్న పిల్లలు, వృద్ధులకు దర్శనంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించడం జరిగినది. వీరి సేవలను భక్తులు మరియు హన్మకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ,వేయి స్తంభాల గుడి ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ ,ఈవో అనిల్ కుమార్, వీరిని లీడ్ చేసిన మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మరియు కేయూ బయోటెక్నాలజీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాధిక ను తదితరులు అభినందించారు.

## కౌన్సిలర్లను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే అరూరి

**ప్రజాసమస్యల పట్ల గొంతు ఎత్తాలని సూచన..**



కాజీపేట,వాయిస్ టుడే: వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి ఘన విజయం సాధించిన ఆరుగురు కౌన్సిలర్లను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ నేత అరూరి రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదవి బాధ్యతలు స్వీకరించిన 2వ వార్డు సభ్యురాలు బానోత్ జ్యోతి నవీన్,3వ వార్డు సభ్యులు గుజ్జ వీర రాఘవరావు,7వ వార్డు సభ్యులు తిరుపతి సురేష్,9వ వార్డు సభ్యురాలు సింగరబోయిన రమ-రాజశేఖర్,10వ వార్డు సభ్యురాలు తుమ్మల అరుణ-శ్రీధర్,11వ వార్డు సభ్యులు సిలువేరు కుమారస్వామి లకు అరూరి రమేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అరూరి రమేష్ మాట్లాడుతూ కౌన్సిలర్లుగా గెలిచిన మీరు ప్రజాసమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలని,ఎప్పటికప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని కోరారు. మీ కష్టసుఖాలలో తోడుగా ఉంటానని..ఎవరికి భయపడకుండా ప్రజలకు కావలసిన అవసరాల పట్ల కౌన్సిల్ లో గట్టిగా పోరాటం చేసి ప్రజల మన్ననలను పొందాలని అరూరి రమేష్ కోరారు.

## శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

**దర్శించుకున్న బీసీ వెల్ఫర్ ఆఫీసర్ కేశురాం దంపతులు**



ఝరాసంగం (వాయిస్ టుడే): మండల కేంద్రం లో శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా బీసీ వెల్ఫర్ ఆఫీసర్ కేశురాం దంపతులు ఆ పరమేశ్వరునికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిబద్ధతకు, అచంచల విశ్వాసానికి, త్యాగానికి ప్రతీకగా ఉపవాస ధీక్షలతో, జాగారాలతో శివరాత్రి పండుగను హిందువులు జరుపుకుంటారని, సృష్టి లయకారునిగా శివున్ని భక్తి ప్రపత్తులతో కొలుచుకుంటారని తెలంగాణ ప్రజలకు, ప్రజలకు ఆ మహాశివుడు ఆయురారోగ్యాలను, సుఖ సంతోషాలను ప్రసాదించాలని ఆ పరమేశ్వరుడిని వేడుకున్నానన్నారు.

## మక్తల్ మున్సిపార్టీ పై కాంగ్రెస్ జెండా

**చైర్మన్ మానస వైస్ చైర్మన్ పర్సన్ శైవవిరెడ్డి**
**ప్రకటించిన మంత్రి వాకిటి శ్రీహరి**




మక్తల్ ఫిబ్రవరి 16 (వాయిస్ టుడే ప్రతినిధి) : మక్తల్ మున్సిపాలిటీ ఎన్నికలలో అత్యధిక వార్డు కౌన్సిలర్లు గెలిచి కొత్త మున్సిపాలిటీ చైర్మన్ గా వాకిటి మానస ఎన్నికైనారు. వైస్ చైర్మన్ గా శైవిరెడ్డిని ఎన్నుకున్నారు. 15 వార్డులకు ఎన్నికలు నిర్వహించగా 12 వార్డులు కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలిచి పూర్తి మెజార్టీ సాధించారు. 12వ వార్డులో గెలుపొందిన రహీం పటేల్ బలపరచగా 12మంది కాంగ్రెస్ వార్డు కౌన్సిలర్లు అందరు 14వ వార్డులో గెలిచిన వాకిటి మానసకు చేతులెత్తి వార్డు కౌన్సిలర్లు మద్దతు పలికారు. దీంతో చైర్మన్ ఎన్నిక పూర్తి మెజార్టీ సాధించి వాకిటి మానసకు అధికారులు ప్రమాణస్వీకారం చేయించినారు. వైస్ చైర్మన్ గా తొమ్మిదవ వార్డు అభ్యర్థిగా ప్రమాణ స్వీకార చేశారు.గెలుపొందిన శైవిరెడ్డి వైస్ ఛైర్మన్ గా ఎన్నికై చిన్న వైయసురాలు గా చరిత్రకెక్కింది.




## వార్డు మెంబర్ల శిక్షణ కార్యక్రమం

మాడ్గులపల్లి ఫిబ్రవరి 16(వాయిస్ టుడే): జిల్లా పంచాయతీ అదికారి ఆదేశముల ప్రకారము ఎంపీడీఓ జి.వంశీధర్ అధ్యక్షతన నూతనముగా ఎన్నిక కాబడిన నూతన వార్డ్ మెంబర్ లకు జనరల్ ఓరియంటేషన్ మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి శిక్షణ కార్యక్రమం ఎం ఆర్ సి బిల్డింగ్ మాడ్కులపల్లి నందు ఉదయం 9.00 గం.ల నుండి సాయంత్రము 5.00 గం.ల వరకు టి ఓ టి లైన యస్.వినయ్ కుమార్, వి.శివ, పి దుర్గయ్య జి. సతీష్ లతో శిక్షణ కార్యక్రమం వార్డ్ సభ్యులకు ఇవ్వడం జరిగినది. ఇట్టి కార్యక్రమము నందు మండల ట్రైనర్ లింగా రెడ్డి , ఎం పి ఓ.సంగీత పాల్గొన్నారు.



## నందివాహన సేవలో సంగమేశ్వరుడు

ఝరాసంగం (వాయిస్ టుడే): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం క్షేత్రంలో శ్రీ పార్వతీ సమేత కేతకి సంగమేశ్వర స్వామి వారి మహాశివరాత్రి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**రుద్రాభిషేకం.. కుంకుమార్చన..**

బ్రహ్మోత్సవాల క్రమంలో స్వామి వారికి శాస్త్రోక్తంగా మహారుద్రాభిషేకం, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు జరిగాయి. ఈ వేడుకను వీక్షించేందుకు తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. అమృత గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

**పురవీధుల్లో నందివాహన సేవ**

సాయంత్రం ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి నందివాహనం (పల్లకి) పై ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల శివనామ స్మరణల మధ్య స్వామివారి శోభాయాత్ర పురవీధుల గుండా సాగింది. భక్తులు దారిపొడుగునా స్వామివారికి నీరాజనాలు పలికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు వేలాది మంది భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**